ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -281 పేజీలు - 08 వెల - 04/-

గురువారం 21 ఆగస్టు 2025





# ఆవిష్కరణల కేంద్రంగా ఏపీ

## సీఎం చంద్రబాబు, టాటా చైర్మన్ చంద్రశేఖరన్ చేతుల మీదుగా టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

- కేవలం 24 గంటల్లో 1,67,321 స్టార్టప్‌ల రిజిస్ట్రేషన్‌తో సరికొత్త చరిత్ర
- అమరావతితో పాటు మరో నాలుగు నగరాల్లో ఇన్నోవేషన్ కేంద్రాల ఏర్పాటు
- ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యమన్న సీఎం



**అమరావతి,ఆగస్టు 20,ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణల రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించింది. రాష్ట్రంలో యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్' (ఆర్టీఐహెచ్) ప్రారంభోత్సవం రోజే అరుదైన ప్రపంచ రికార్డును సొంతం చేసుకుంది. కేవలం 24 గంటల వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 1,67,321 ఇన్నోవేషన్, బిజినెస్ స్టార్టప్‌లు రిజిస్టర్ కావడం ద్వారా ఈ అసాధారణ ఘనత సాధ్యమైంది. ఈ రికార్డును గుర్తిస్తూ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారిక ధృవపత్రాన్ని అందజేశారు. ఈ అద్భుతమైన ఆరంభం, రాష్ట్రంలో స్టార్టప్‌ల పట్ల యువతలో ఉన్న ఆసక్తికి, ప్రభుత్వ ప్రోత్సాహానికి నిదర్శనంగా నిలిచింది.

మిగతాది 2లో...

## జైల్లో ఉంటే పదవిలో

# కొనసాగలేరు

- 'ప్రధాని, సీఎంలు, మంత్రుల తొలగింపు బిల్లుపై క్లారిటీ ఇచ్చిన అమిత్ షా
- జైల్లో ఉన్నవారు ప్రధాని, సీఎం, మంత్రులుగా కొనసాగకుండా కొత్త బిల్లులు
- లోక్‌సభలో మూడు రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టిన అమిత్ షా
- రాజకీయాల్లో నైతిక విలువలు పెంచడమే లక్ష్యమని స్పష్టీకరణ
- 30 రోజుల్లో బెయిల్ రాకపోతే పదవిలో కొనసాగేందుకు అనర్హులు
- బెయిల్ లభించిన తర్వాతే తిరిగి పదవులు చేపట్టేందుకు అవకాశం

**ఆగస్టు 20,ఆంధ్ర ప్రగతి**

జైల్లో ఉన్నవారు ప్రధాని, సీఎం, మంత్రులుగా కొనసాగకుండా కేంద్రం కొత్త బిల్లు తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై విపక్షాలు భగ్గుమంటున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ బిల్లుపై సోషల్ మీడియా వేదికగా వివరణ ఇచ్చారు. రాజకీయాల్లో నైతిక విలువలను పునరుద్ధరించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కీలక బిల్లు తెచ్చిందని స్పష్టం చేశారు. అరెస్ట్ అయి జైల్లో ఉన్న వ్యక్తులు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి లేదా మంత్రులు వంటి ఉన్నత రాజ్యాంగ పదవుల్లో కొనసాగకుండా నిరోధించేందుకు ఉద్దేశించిన మూడు రాజ్యాంగ సవరణ బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టినట్టు వెల్లడించారు. స్పీకర్ అనుమతితో సభ ముందు ఈ బిల్లులను ఉంచినట్లు ఆయన తెలిపారు.

మిగతాది 2లో...





2లో.

## స్త్రీశక్తి పథకం సూపర్ సక్సెస్

ఆర్టీసీ అధికారులు, సిబ్బంది కృషి అభినందనీయం

ఆర్టీసీ అధికారులతో సమీక్షించిన మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్

## నీటికుంటలో పడి ఆరుగురు

# చిన్నారుల మృతి...

## సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

- కర్నూలు జిల్లా ఆస్పరి మండలం చిగిలిలో తీవ్ర విషాదం
- పాఠశాల సమీపంలోని నీటి కుంట లో పడి ఆరుగురు చిన్నారుల మృతి
- మృతులంతా ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులుగా గుర్తింపు
- ఆడుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కుంట లో పడిపోయిన చిన్నారులు
- ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆవేదన
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా

2లో.







## హైదరాబాద్ అభివృద్ధిలో చంద్రబాబు, వైఎస్ పాత్ర

- హైదరాబాద్ అభివృద్ధికి ఎందరో కృషి
- హైటెక్ సిటీ కడతామన్నా వ్యతిరేకించారు
- అభివృద్ధిని కొనసాగించాలన్నదే మా పట్టుదల
- మరింత సుందర నగరంగా తీర్చిదిద్దుతాం
- ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రార్ కార్యాలయ శంకుస్థాపనలో రేవంత్

హైదరాబాద్,**ఆగస్టు 20,ఆంధ్ర ప్రగతి**రాజీవ్ గాంధీ వల్లే ఐటీ రంగంలో చాలా మంది రాణిస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆనాడు రాజీవ్ గాంధీ కంప్యూటర్ ను దేశానికి పరిచయం చేశారు.. పీవీ నర్సింహారావు స్పెషల్ ఎకనామిక్ జోన్ ను మంజూరు చేశారు.. నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి హైటెక్ సిటీకి శంకుస్థాపన చేశారని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఉమ్మడి రాష్ట్రంలో సీఎంలుగా వ్యవహరించిన చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాత్ర ఉందని మిగతాది 2లో...



## పటిష్టంగా నూతన క్రిమినల్ చట్టాల అమలు

ఎపి దేశానికి రోల్ మోడల్‌గా ఉండేలా చర్యలు

సిఎస్, డిజిపిలతో కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్

2లో.

# విధి నిర్వహణకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు

- అటవీశాఖ అధికారులపై టీడీపీ ఎమ్మెల్యే దాడి... పవన్ కల్యాణ్ ఆగ్రహం
- శ్రీశైలం అడవిలో ఫారెస్ట్ అధికారులపై దాడి ఘటన
- ఘటనపై తీవ్రంగా స్పందించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- ఎమ్మెల్యే, ఆయన అనుచరుల ప్రమేయంపై విచారణకు ఆదేశం



2లో.

# సీపీ రాధాకృష్ణన్ నామినేషన్

- ఉపరాష్ట్రపతి పదవికి ఎన్డీఏ అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ నామినేషన్
- ప్రధాని మోదీ, అమిత్ షా, ఇతర కేంద్ర మంత్రుల హాజరు
- సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నికల పోలింగ్
- ఎలక్టోరల్ కాలేజీలో మెజారిటీతో రాధాకృష్ణన్ గెలుపు ఖాయం



# ఆవిష్కరణలకేంద్రంగా ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం నాడు మంగళగిరిలోని మయూరి టెక్ పార్కులో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు, టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్‌తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఆవిష్కరణలకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ హబ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. "రతన్ టాటా గారి నిరాడంబరత, దేశానికి ఆయన చేసిన సేవ అందరికీ ఆదర్శం. ఆయన ఆలోచనలను భవిష్యత్ తరాలకు అందించాలనే సదుద్దేశంతో, 'గివ్ బ్యాక్ టు ది సొసైటీ' అనే ఆయన విధానాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ ఇన్నోవేషన్ హబ్‌కు శ్రీకారం చుట్టాం" అని చంద్రబాబు వివరించారు. ఈ హబ్ ద్వారా యువతలోని వినూత్న ఆలోచనలను గుర్తించి, వాటిని విజయవంతమైన వ్యాపారాలుగా మార్చేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

**రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ.. ఇంటికో పారిశ్రామికవేత్తే లక్ష్యం**

ఈ ఇన్నోవేషన్ కేంద్రాలను కేవలం అమరావతికే పరిమితం చేయకుండా 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌లో రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నట్లు సీఎం తెలిపారు. అమరావతి ప్రధాన కేంద్రంగా పనిచేస్తుండగా, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురంలో అనుబంధ కేంద్రాలు పనిచేస్తాయని చెప్పారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ ఇన్నోవేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసి, స్థానిక యువతకు అవకాశాలు కల్పించాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలనేదే నా నినాదం. ఈ లక్ష్య సాధనలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కీలక పాత్ర పోషిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. సరైన ప్రభుత్వ విధానాలతో సంపద సృష్టించడం ద్వారానే సంక్షేమం సాధ్యమవుతుందని, గతంలో ఐటీ రంగాన్ని ప్రోత్సహించిన తరహాలోనే ఇప్పుడు స్టార్టప్‌లకు ఊతమిస్తున్నామని అన్నారు.

**టెక్నాలజీతో అభివృద్ధి.. అమరావతిలో క్వాంటం వ్యాలీ**

టెక్నాలజీ వల్ల ఉద్యోగాలు పోతాయన్న వాదనను తాను నమ్మనని, టెక్నాలజీ కొత్త అవకాశాలను సృష్టిస్తుందని చంద్రబాబు అన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, రక్షణ వంటి అనేక రంగాల్లో ఆవిష్కరణలకు అపారమైన అవకాశాలున్నాయని యువతకు సూచించారు. "అమరావతి నగరాన్ని క్వాంటం కంప్యూటింగ్ హబ్‌గా అభివృద్ధి చేస్తాం. క్వాంటం వ్యాలీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటివి భవిష్యత్తులో విప్లవాత్మక మార్పులు తేబోతున్నాయి. ఈ అవకాశాలను అందిపుచ్చుకునేలా రాష్ట్రాన్ని సిద్ధం చేస్తున్నాం" అని తెలిపారు. ఒకవైపు సంపద సృష్టిస్తూ, మరోవైపు 'పీ4' (ప్రజా భాగస్వామ్యంతో పేదరికంపై పోరాటం) ద్వారా పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామని, 'వెల్తీ, హెల్తీ, హ్యాపీ సొసైటీ'గా ఏపీని మారుస్తామని పునరుద్ఘాటించారు.

టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతతో అతి తక్కువ సమయంలోనే ఇన్నోవేషన్ హబ్‌కు రూపమిచ్చారని ప్రశంసించారు. స్టార్టప్‌లకు ఇదొక అద్భుతమైన అవకాశమని, ఆరోగ్యం నుంచి వ్యవసాయం వరకు అనేక రంగాల్లో వినూత్న పరిష్కారాలు కనుగొనేందుకు ఈ కేంద్రం వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్, టీజీ భరత్, భారత్ ఫోర్జ్ చైర్మన్ బాబా కల్యాణి, అమర్ రాజా బ్యాటరీస్ చైర్మన్ గల్లా జయదేవ్ తదితర పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. అనంతరం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టార్టప్ కంపెనీల స్టాళ్లను ముఖ్యమంత్రి సందర్శించి, వారి ఉత్పత్తులను పరిశీలించారు.

# హైదరాబాద్ అభివృద్ధిలో చంద్రబాబు, వైఎస్ పాత్ర !

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. 1994 నుంచి 2014 వరకు హైదరాబాద్‌ను అప్పటి సీఎంలు అభివృద్ధి చేసినట్లు- పేర్కొన్నారు. గూగుల్‌లాంటి ప్రముఖ సంస్థల్లో తెలుగువారు పెద్ద పదవుల్లో ఉన్నారని తెలిపారు. మన ప్రాంత విద్యార్థులు ఇక్కడే చదువు కోవాలని పలు సంస్థలు నిర్మించారని గుర్తు చేశారు. గచ్చిబౌలిలో డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ ఇంటిగ్రేటెడ్ ఆఫీసులకు సీఎం శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడారు. హైటెక్ సిటీ కట్టినప్పుడు అవహేళన చేశారు. హైదరాబాద్ నగరం సింగపూర్, టోక్యోతో పోటీ పడుతోంది. మన వద్ద అన్ని ఉన్నప్పుడు చిత్తశుద్ధితో పనిచేయడం కావాలి. అమెరికాలో మన ఐటీ- నిపుణులు పని చేయడం ఆపేస్తే స్తంభించిపోతుంది. రాష్ట్రంలో శాంతి భద్రతలతో కూడిన ఉద్యోగ భద్రత ఇచ్చాం. రాబోయే పదేళ్లలో వన్ బిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దుతాం అన్నారు. ఇప్పుడు మూసీ ప్రక్షాళన ఎందుకు అడ్డుకుంటున్నారు. మూసీ మురికిలో బతకాలని పేదలు ఎందుకు అనుకుంటారు? తెలంగాణ రైజింగ్ 2047తో అభివృద్ధి చేసుకుందాం. మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన జరగాలి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సరైన సౌకర్యాలు లేవు. అన్ని సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మించాలని ప్రభుత్వం సంకల్పిస్తుందోని రేవంత్ వెల్లడించారు. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా పరిపాలనకు ఇబ్బంది లేకుండా నిర్మాణం చేపట్టనున్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బులిటీలో భాగంగా 30 కోట్లు- ఈ భవన నిర్మాణానికి అపర్ణ కన్స్ట్రక్షన్ కేటాయించిందన్నారు. నిజాం నవాబులు 400 ఏళ్ల చరిత్ర ఉన్న నగరంలో నిర్మించారు.. మాదాపూర్, కొండాపూర్, వట్టి నాగులపల్లి వరకు అభివృద్ధి చేసేందుకు వైఎస్ రాజశేఖర్ రెడ్డితో పాటు- పలువురు ముఖ్యమంత్రులు కృషి చేశారు.. ప్రపంచంలోని 500కు పైగా కంపెనీలు ఇక్కడే ఉన్నాయి.. మరోవైపు, చిన్న చిన్న వర్షాలకే హైదరాబాద్ నగరం మునిగిపోతుందని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళన చేస్తామంటే కొందరు వద్దని అంటున్నారు.. ఈ నగరాన్ని ఇలాగే వదిలేద్దామా.. ప్రపంచానికి ఆదర్శంగా హైదరాబాద్ ను నిలుపుకుందామా? అని ప్రశ్నించారు. ప్రపంచం ఆశిస్తున్న స్థాయిలో హైదరాబాద్ కు ఇంకా డెవలప్‌మెంట్ చేయాల్సి ఉంది.. మనం న్యూయార్క్, టోక్యో లాంటి నగరాలతో పోటీ- పడాలి.. చిత్తశుద్ధితో సాధిస్తే ఏదైనా సాధ్యమవుతుందన్నారు. కాబట్టి, వరిజిబాల్ సిటీ-ని గోల్డెన్ సిటీ- చేయాలంటే మూసీ ప్రక్షాళన చేసి తీరాలి.. మనకు నదుల ప్రక్షాళన అవసరం.. గంగా, యమున, సబర్మతి నదులను ఆయా రాష్ట్రాలు ప్రక్షాళన చేశాయి.. మనం కూడా మూసీని ప్రక్షాళన చేసుకోవాలన్నారు. పేదల కోసం స్థలాలు వెతకమని మంత్రులకు చెబుతున్నా.. వారికి ఇల్లు కట్టి ఇద్దాం.. సొంత ఇల్లు కళ నెరవేరాలంటే నగరం విస్తరించాలి.. మూసీ విస్తరించాలి.. రాత్రుళ్ళు అక్కడ బిజినెస్ నడవాలి.. నైట్ ఎకానమిని మూసీలో సృష్టించాలని రేవంత్ రెడ్డి సూచించారు. అయితే, గత ముఖ్యమంత్రుల దూరదృష్టితో హైదరాబాద్ కి అనేక అంతర్జాతీయ కంపెనీలు వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. ఇప్పుడు అమెరికాలోని సిలికాన్ వ్యాలీని శాసిస్తున్నాం.. మన వాళ్ళు ఒక్క రోజు పని చేయకపోతే అమెరికా కుప్పకూలిపోతుంది. కాగా, తెలంగాణ రైజింగ్ 2047 అంటు-న్నాం.. 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తెలంగాణ ఎదగాలని చెప్పుకొచ్చారు. ఇక, సంవత్సరానికి 15 వేల కోట్ల ఆదాయం ఇచ్చే రిజిస్ట్రేషన్ శాఖ బంగారు గుడ్డు పెట్టె- బాతు.. లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టి రాష్ట్రానికి ఆదాయం తెచ్చి పెడుతున్న వారిని దొంగలుగా చూస్తున్నారు.. నేరం చేసే వాళ్ళ మాదిరిగా రిజిస్ట్రేషన్ కు వచ్చే వాళ్ళను చూసే పరిస్థితి మారాలని సీఎం సూచించారు. అన్ని వసతులు ఈ ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉంటాయని రేవంత్ రెడ్డి సూచించారు. ఈ ప్రభుత్వం మీది.. మీకు వసతులు కల్పించడం వల్ల మంచి పేరు వస్తుంది.. 144 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సంవత్సరానికి 19 లక్షల డాక్యుమెంట్లు- చేస్తున్నాం.. విదేశాల్లో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు మంచి పేరు ఉంది.. అన్ని ప్రభుత్వ శాఖలను ప్రక్షాళన చేయాలి.. 2034లో ప్రపంచం హైదరాబాద్ ను ఫ్యూచర్ సిటీగా చూడడానికి రావాలి.. అన్ని విభాగాలు అక్కడి నుంచే పని చేయాలని వెల్లడించారు. ఇక, జూన్ 2వ తేదీ లోపు 11 ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలు పూర్తి చేయాలి.. కేవలం 8 నెలల్లోనే అపర్ణ కన్స్ట్రక్షన్ వారు ఇంటిగ్రే-టె-డ్ సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసు నిర్మాణం పూర్తి చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్ పేర్కొన్నారు.

# విధి నిర్వహణకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు

## అటవీశాఖ అధికారులపై టీడీపీ ఎమ్మెల్యే దాడి... పవన్ కల్యాణ్ ఆగ్రహం

**అమరావతి,ఆగస్టు 20,ఆంధ్ర ప్రగతి**

ప్రభుత్వ విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులకు ఆటంకం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, చట్టం ముందు అందరూ సమానమేనని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా హెచ్చరించారు. శ్రీశైలం అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ సిబ్బందిపై జరిగిన దాడి ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనలో బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు."శ్రీశైలం అటవీ ప్రాంతంలో విధి నిర్వహణలో ఉన్న అటవీ శాఖ ఉద్యోగులతో ఘర్షణకు దిగి, దాడికి పాల్పడ్డ ఘటన గురించి శాఖ ఉన్నతాధికారులు వివరించారు. ఈ ఘటనల్లో శాసనసభ్యుడు, ఆయన అనుచరుల ప్రమేయంపై విచారించి సవివరంగా నివేదిక ఇవ్వాలని ఆదేశించాను. బాధ్యులపై నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేయాలని స్పష్టంగా చెప్పాను.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం... చట్టాలను అతిక్రమించి క్రిమినల్ చర్యలకు పాల్పడి ఏ స్థాయిలో ఉన్నవారినైనా ఉపేక్షించకూడదని, ఇందుకు ప్రధానమంత్రి అయినా, ముఖ్యమంత్రి అయినా ఒకటే అని, అరెస్టయిన 31వ రోజు పదవి కోల్పోయే చట్టం తీసుకురాబోతోంది.'మేము తప్పు చేసినా బాధ్యులను చేయమని రాష్ట్రంలో గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు గారు, నేను కూడా శాసనసభలో స్పష్టంగా చెప్పాం. నిబద్ధతతో, నియంత్రణతో విధులు నిర్వర్తిస్తున్నాం. కాబట్టి ప్రజా జీవితంలో ఉన్నవారు ముందుగా తమను తాము నియంత్రించుకోవాలి. ఉద్యోగుల విధి నిర్వహణకు ఆటంకం కలిగించేవారు ఏ స్థాయిలో ఉన్నా చంద్రబాబు గారి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఉపేక్షించదు" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో స్పందించారు.

# స్త్రీశక్తి పథకం సూపర్ సక్సెస్

## ఆర్టీసీ అధికారులు, సిబ్బంది కృషి అభినందనీయం

## ఆర్టీసీ అధికారులతో సమీక్షించిన మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్

**అమరావతి,ఆగస్టు 20,ఆంధ్ర ప్రగతి** కూటమి ప్రభుత్వం మహిళల కోసం అందించిన స్త్రీ శక్తి సూపర్ సక్సెస్ అయిందని రవాణాశాఖామంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి అన్నారు. స్త్రీ శక్తి పథకం సక్సెస్ సందర్భంగా పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్ లో ఏపీఎస్ ఆర్టీసీ అధికారులతో మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు- చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటి ఒక్కో విశిష్టత కలిగి ఉన్నాయని, వాటిలో మహిళామూర్తులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చే స్త్రీ శక్తి పథకం విజయవంతం కావడం అభినందనీయమన్నారు. ఉచిత బస్సు పథకం అమలుకు ముందు పక్క రాష్ట్రాల్లోపథకం అమలు తీరును అధ్యయనం చేసిన తరువాతనే మన రాష్ట్రంలో పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన మహిళలకు ఉచిత బస్సు పథకమని ఇందుకు వారికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని తెలిపారు. పథకం అమలు తీరులో చిన్న చిన్న లోటుపాట్లు సహజమని, ఒడిదుడుకులను తట్టుకుని సద్విమర్శలను పరిగణలోకి తీసుకుని పథకంను విజయవంతం చేయడంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది కృషి ఎంతో ఉందన్నారు. స్త్రీ శక్తి పథకం అమలు ప్రభుత్వానికి భారం కాదని, బాధ్యత అని మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అన్నింటిలో స్త్రీ శక్తి పథకం టాప్ లో ఉంటుందన్నారు. ఈ ఆరు రోజుల్లో 65 లక్షల మందికి పైగా మహిళలు ఫ్రీ బస్సు సేవలను సద్వినియోగం చేసుకున్నారని వివరించారు. ఈ మేరకు ఆర్టీసీకి ప్రభుత్వం సబ్సిడీ చెల్లిస్తుందన్నారు. ఫ్రీ బస్సు పథకం ప్రారంభానికి ముందే బస్ స్టేషన్లు, బస్ షెల్టర్లలో రద్దీకి అనుగుణంగా అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. దీంతో సమస్యలు ఉత్పన్నమవ్వ లేదని వివరించారు. స్త్రీ శక్తి పథకం విజయానికి ఆర్టీసీ సిబ్బంది టీ-మ్ వర్క్ అద్భుతమన్నారు. మన ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు చిత్తశుద్ధితో పథకంను అమలు చేస్తున్నామని, ఇకపై కూడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పథకంను నిర్విఘ్నంగా అమలు చేస్తామన్నారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణించే ఫ్రీ బస్సు లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను అందించే యోచనలో ఉన్నామని మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ ప్రతి బస్సులో సీసీ కెమెరాలు, కండెక్టర్ల కు బాడీ కెమెరాలు ఏర్పాటు- చేయనున్నామని తెలిపారు ఆర్టీసీని బలోపేతం చేస్తాం. పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. ఆర్టీసీ పరిపుష్టికి వనరులు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఆర్టీసీ స్థలాలను లీజుకు ఇచ్చి ఆదాయం సమకూర్చుకుంటామని, కార్గో సేవలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం ప్రయాణీకుల రద్దీకి అవసరమైన కొత్త బస్సులను కొనుగోలు చేయలేదన్నారు. అయితే కూటమి ప్రభుత్వం త్వరలో 750 ఎలక్ట్రిక్రల్ బస్సులు తీసుకురానుందని, మరో నాలుగేళ్లలో 2500కు పైగా నూతన బస్సులను కొనుగోలు చేయనున్నామని తెలిపారు. నూతనంగా కొనుగోలు చేసే బస్సులన్నీ ఎలక్ట్రిక్రల్ బస్సులే అని వివరించారు. దాంతో రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లినా పల్లె వెలుగు బస్సులు సైతం ఏసీ బస్సులే ఉంటాయని చెప్పారు. ఘాట్ రోడ్ ప్రాంతాల్లో సైతం ఫ్రీ బస్సు అమలు చేస్తున్నామని, రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో కొన్ని సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, మరో వారం రోజుల్లో ఆ సమస్యలను పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. తిరుమలకు కూడా ఫ్రీ బస్సు అమలుపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామన్నారు. అలాగే సాంకేతిక సమస్యలను పరిష్కరించి అతి త్వరలోనే తిరుమలకు ఫ్రీ బస్సు పై అనుకూల ప్రకటన వస్తుందన్నారు. ఆర్టీసీకి ప్రయాణీకులు, సిబ్బంది రెండు కళ్లు వంటి వారని, వారి సంక్షేమం, రక్షణ బాధ్యతల్లో వెనక్కు తగ్గేది లేదన్నారు. ముఖ్యంగా మహిళల రక్షణ విషయం రాజీపడే ప్రసక్తే లేదన్నారు. అతి త్వరలో కండెక్టర్ పోస్ట్ లు భర్తీ చేస్తామని హామి ఇచ్చారు. ఉచిత బస్సు పథకం ఆర్టీసీ సంస్థలోని దాదాపు 75 శాతం బస్సుల్లో వర్తిస్తుందన్నారు. మహిళలు, బాలికలు, ట్రాన్స్ జెండర్లు ఉచిత బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థిక వెసులుబాటును పొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పటిష్టంగా నూతన క్రిమినల్ చట్టాల అమలు

## ఎపి దేశానికి రోల్ మోడల్‌గా ఉండేలా చర్యలు

## సిఎస్, డిజిపిలతో కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్

**అమరావతి,ఆగస్టు 20,ఆంధ్ర ప్రగతి** నూతన క్రమినల్ చట్టాల అమలులో ఎపి దేశానికి రోల్ మోడల్ గా ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సిఎస్,డిజిపిలకు కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సూచించారు. నేరం జరిగిన ప్రాంతాల్లో అనగా సీన్ ఆఫ్ అఫెన్స్ లో పూర్తిగా ఆడియో వీడియో చిత్రీకరణ చేయాలని,అన్ని ఎఫ్ఐఆర్లను ఇ-సాక్ష్యంలో పొందుపర్చాలని డిజిపికి హోంశాఖ కార్యదర్శికి గోవింద్ మోహన్ సూచించారు. నూతన క్రిమినల్ చట్టాల పటిష్ట అమలుకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ఢిల్లీ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డిజిపి హరీశ్ కుమార్ గుప్తాలతో వీడియో సమావేశం నిర్వహించారు. మన దేశంలో కొత్త క్రిమినల్ చట్టాలు అనగా భారతీయ న్యాయ సంహిత,భారతీయ నాగరిక్ సురక్ష సంహిత మరియు భారతీయ సాక్ష్య అధినియం అనే చట్టాలు పాత క్రిమినల్ చట్టాలైన ఇండియన్ పీనల్ కోడ్(ఒఈ),క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (ఈసఈ),మరియు ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ ల స్థానే అమలులోకి వచ్చాయి. ఈనూతన క్రమినల్ చట్టాలను క్షేత్ర స్థాయిలో పటిష్టవంతంగా అమలు చేసేందుకు వివిధ పోలీస్ స్టేషన్లు, కోర్టులు,జైళ్ళుకు,ఫోరెన్సిక్ లేబరేటరీల్లో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, సాంకేతిక పరిజ్ఞానం తదితర అంశాలపై ఆయన చర్చించారు. ఈసందర్భంగా హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ మాట్లాడుతూ ఫోరోన్సిక్ ఇకో సిస్టమ్‌ను పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని దానిలో భాగంగా ప్రస్తుతం ఉన్న ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీలను మరింత పటిష్టం వంతం చేయాలని ఆదిశగా తగిన చర్యలు తీసుకోవాలని సిఎస్,డిజిపిలకు సూచించారు. వాటిలో వివిధ ఖాళీలను భర్తీ చేసేందుకు అర్హులైన వారిని కాంట్రాక్టు విధానంలో భర్తీ చేయాలని చెప్పారు. నూతన క్రిమినల్ చట్టాల పటిష్ట అమలుకు సంబంధించి కోర్టు రూములు,జైళ్ళు, ఫోరన్సిక్ సైన్స్ లేబొరేటరీలు,ప్రభుత్వ కార్యాలయాల,బ్యాంకులు తదితర చోట్ల వీడియో కాన్పరెన్సింగ్ విధానం అందుబాటులో ఉండేలా చూడాలని గోవింద్ మోహన్ సిఎస్,డిజిపిలకు సూచించారు.అలాగే -ట్రైనింగ్ అండ్ కెపాసిటీ- బిల్డింగ్,జీరో ఎఫ్ఐఆర్, ఇ-ఎఫ్ఐఆర్,మానిటంరింగ్ ఆఫ్ ఆర్గనైజ్డ్ -కై-మ్,వివిధ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీల ఆధునికీ కరణ,తగిన సిబ్బంది ఏర్పాటు-,సిటిజన్ సెంట్రిక్ ప్రోవిజన్స్ అయిన ఎస్ఎంఎస్,ఇ-మెయిల్ సేవలను సిసిటిఎన్‌స్తో ఇంటిగ్రేషన్,ఫిర్యాదుదారులకు ఎస్ఎంఎస్ అలెర్టులు పంపించడం వంటి అంశాల్లో ఎపి పోలీసులు చేపట్టిన ఎపి పోలీస్ సేవా,సిటిజన్ పోర్టల్,శక్తి యాప్ వంటి వినూతన్న చర్యలను గోవింద్ మోహన్ ప్రశంసించారు. అంతకు ముందు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ కలక్టరేట్లు- సహా డివిజన్,మండల స్థాయి ప్రభుత్వ కార్యాలయాల్లో వీడియో కాన్పరెన్సింగ్ విధానం ఇప్పటికే అందుబాటులో ఉందని చెప్పారు.డిజిపి హరీశ్ కుమార్ గుప్త మాట్లాడుతూ సీన్ ఆఫ్ అఫెన్స్ ప్రాంతాల్లో నూరు శాతం ఆడియో,వీడియో చిత్రీకరణకు చర్యలు తీసుకుంటు-న్నట్టు- చెప్పారు.అదే విధంగా అన్ని ఎఫ్ఐఆర్లను ఇ-సాక్షియంలో నమోదుకు చర్యలు తీసుకుంటు-న్నట్టు- తెలిపారు. ఈవీడియో సమావేశంలో జైళ్ళశాఖ డిజి అంజనీ కుమార్,శాంతి భద్రతల అదనపు డిజి ఎన్.మధుసూదన్ రెడ్డి,జైళ్ళశాఖ డిఐజి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు..

# జైల్లో ఉంటే పదవిలో కొనసాగలేరు

(మొదటి పేజీ తరువాయి)

బిల్లుల్లోని ప్రధాన నిబంధనలు ఇవే: అమిత్ షా

**1. జైల్లో ఉంటే పదవిలో కొనసాగలేరు**

ఏదైనా కేసులో అరెస్ట్ అయి జైలులో ఉన్న వ్యక్తి.. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రిగా గానీ, కేంద్ర లేదా రాష్ట్ర మంత్రిగా గానీ తన విధులను నిర్వర్తించలేరు. వారు తమ పదవిలో కొనసాగడాన్ని ఈ బిల్లులు పూర్తిగా నిరోధిస్తాయి.

**2. 30 రోజుల గడువు**

అరెస్టయిన రాజకీయ నాయకుడు 30 రోజుల్లోగా బెయిల్ పొందడంలో విఫలమైతే, 31వ రోజున వారిని పదవి నుంచి తప్పించాల్సి ఉంటుంది. ఒకవేళ ప్రధానమంత్రి లేదా ముఖ్యమంత్రి వారిని తొలగించకపోతే, చట్టప్రకారం వారు ఆ పదవిలో కొనసాగే అర్హతను వాటంతట అవే కోల్పోతారు. అయితే, న్యాయ ప్రక్రియ ద్వారా బెయిల్ పొందిన తర్వాత తిరిగి వారిని ఆ పదవుల్లో నియమించేందుకు అవకాశం ఉంటుంది.

**3. నైతిక విలువల పరిరక్షణే లక్ష్యం**

రాజ్యాంగాన్ని రూపొందించిన సమయంలో, నేతలు అరెస్ట్ అయిన తర్వాత కూడా నైతిక బాధ్యతతో రాజీనామా చేయరని బహుశా మన రాజ్యాంగ నిర్మాతలు ఊహించి ఉండరని అమిత్ షా వ్యాఖ్యానించారు. ఇటీవల కాలంలో కొందరు ముఖ్యమంత్రులు, మంత్రులు అరెస్ట్ అయినా రాజీనామా చేయకుండా జైలు నుంచే ప్రభుత్వాలను నడుపుతున్న దిగ్భ్రాంతికరమైన సంఘటనలు దేశం చూసిందని ఆయన గుర్తుచేశారు. ఈ జాడ్యంపై ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను, రాజకీయాల్లో దిగజారుతున్న ప్రమాణాలను దృష్టిలో ఉంచుకునే ఈ బిల్లులను తీసుకొచ్చినట్లు ఆయన వివరించారు.ఈ సందర్భంగా, ఒక మంత్రి, ముఖ్యమంత్రి లేదా ప్రధానమంత్రి జైలు నుంచి ప్రభుత్వాన్ని నడపడం సరైనదేనా? అనే విషయాన్ని దేశ ప్రజలు తేల్చుకోవాలని అమిత్ షా అన్నారు.

# సీపీ రాధాకృష్ణన్ నామినేషన్

ఉపరాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియలో కీలక ఘట్టం చోటుచేసుకుంది. అధికార ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ బుధవారం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, పలువురు కేంద్ర మంత్రుల సమక్షంలో ఆయన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ఈ కార్యక్రమం ఎన్డీఏ కూటమి ఐక్యతను, బలాన్ని ప్రదర్శించేలా సాగింది.రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు చేసే సమయంలో కేంద్ర హెూంమంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు, ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వంటి అగ్రనేతలు ఆయన వెంట ఉన్నారు. కూటమిలోని కీలక నేతలంతా హాజరుకావడంతో ఈ కార్యక్రమానికి రాజకీయ ప్రాధాన్యత ఏర్పడింది.

సెప్టెంబర్ 9వ తేదీన ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి స్పష్టమైన మెజారిటీ ఉంది. ఈ నేపథ్యంలో రాధాకృష్ణన్ విజయం లాంఛనప్రాయమేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. సంఖ్యాబలం దృష్ట్యా ఆయన ఎన్నిక ఏకపక్షంగానే జరగనుందని అంచనా వేస్తున్నారు.

# నీటికుంటలో పడి ఆరుగురు చిన్నారుల మృతి...

## కర్నూలు జిల్లా ఆస్పరి మండలం చిగిలిలో తీవ్ర విషాదం

**కర్నూలు,ఆగస్టు 20,ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. ఆడుకోవడానికి వెళ్లిన ఆరుగురు చిన్నారులు ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి ప్రాణాలు కోల్పోయారు. ఈ హృదయ విదారక ఘటన ఆస్పరి మండలం చిగిలి గ్రామంలో చోటుచేసుకుంది.

వివరాల్లోకి వెళితే, చిగిలి గ్రామంలోని పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న శశికుమార్, కిన్నెర సాయి, సాయి కిరణ్, భీమా, వీరేంద్ర, మహబూబ్ అనే ఆరుగురు విద్యార్థులు పాఠశాల సమీపంలో ఆడుకునేందుకు వెళ్లారు. అక్కడ ఉన్న ఓ నీటి కుంట వద్దకు చేరుకున్న చిన్నారులు, అదుపుతప్పి ప్రమాదవశాత్తు అందులో పడిపోయారు. లోతు ఎక్కువగా ఉండటంతో నీటిలో మునిగి ఆరుగురూ అక్కడికక్కడే మరణించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**ఈ ఘటన నన్ను తీవ్రంగా కలచివేసింది: సీఎం చంద్రబాబు**

ఈ దురదృష్టకర సంఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆరుగురు చిన్నారులు ఒకేసారి మరణించడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన చెందారు. "ఎంతో భవిష్యత్తు ఉన్న చిన్నారులు ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడం వారి కుటుంబాలకు తీరని లోటు. వారికి కడుపుకోత మిగిల్చింది. ఈ ఘటన అత్యంత బాధాకరం" అని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన ముఖ్యమంత్రి, వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
గురువారం 21 ఆగస్టు 2025

## కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరునికి
# వెండి పడిగె విరాళం..!



**ఆంధ్ర ప్రగతి పాణ్యం. ఎస్. కొత్తూరు. ఆగస్టు 20:** ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి భక్తులు వెండి నాగ పడిగెను బుధవారం వితరణ చేసినట్లు ఆలయ ఈవో యం. రామక్రిష్ణ తెలిపారు. బనగానపల్లె మండలం నందవరం గ్రామానికి చెందిన కంపమల్ల వెంకట లక్ష్మమ్మ, కంపమల్ల వెంకట సుబ్బారెడ్డి వార్ల కుమారుడు కె. వరప్రసాద రెడ్డి వారి కుటుంబ సభ్యులకు శ్రీ స్వామి వారు ఇంటి ఇలవేల్పు కావడంతో మొక్కుబడిగా ఒక కేజీ 10 గ్రాముల వెండి నాగ పడిగెను ఆలయ అధికార సిబ్బందికి అందజేసినట్లు ఆయన తెలిపారు. దాతలకు ఆలయ మర్యాదలతో శ్రీ స్వామివారికి అభిషేకములు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, అర్చకులు రోహిత్ శర్మ, శివ స్వామి, దాత పాల్గొన్నారు.

## రైతులు పంట నమోదు చేసుకోవాలి.



**ఆంధ్ర ప్రగతి మహానంది ఆగస్టు 20:** రైతులు తాము వేసిన పంటలను వెంటనే పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రెడ్డి తెలిపారు.బుధవారం మహానంది మండలం గోపవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.నానో యూరియా వాడుట ద్వారా పంటకు 80 శాతం నత్రజని అందుతుందని, దీనిని పంటపై నేరుగా పిచికారి చేస్తాం కాబట్టి పంట యొక్క అన్ని భాగాలకు ఇది సులభంగా చేకూరుతుందన్నారు. పర్యావరణ కాలుష్యం తగ్గుతుందని, నేల ఆరోగ్యం కాపాడుకోవచ్చునని, ఖర్చు కూడా తగ్గుతుందని తెలిపారు. రైతులు విచక్షణారహితంగా యూరియా ఎరువులు వాడరాదన్నారు. అన్నదాత సుఖీభవ గ్రీవెన్స్ ఉన్న రైతులు వెంటనే సంబంధిత రైతు సేవ కేంద్రాలలో గ్రీవెన్స్ పోర్టల్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎన్పీసీఐ మ్యాపింగ్ చేసుకోని రైతులు వెంటనే బ్యాంకుకు వెళ్లి చేయించుకుంటే వారికి కూడా అన్నదాత సుఖీభవ నగదు తమ ఖాతాలో జమ అవుతుందన్నారు. కౌలుకు తీసుకున్న రైతులు వెంటనే కౌలు కార్డులు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ వెంకటేశ్వర్లు, వీహెచ్ఏ రాజేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

## అవగాహనతోనే వ్యాధులు దూరం.




**ఆంధ్ర ప్రగతి మహానంది ఆగస్టు 20:** దోమల వ్యాప్తిని అరికట్టడానికి పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహనతోనే వ్యాధులు దూరం అవుతాయని గాజులపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వెంకటరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ప్రపంచ దోమల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు.అనంతరం దోమల నియంత్రణ చర్యలు పకడ్బందీగా చేపట్టి వారి ఆరోగ్య శ్రేయస్సుపై దృష్టి సారించాలని ప్రతిజ్ఞ చేశారు. వైద్యాధికారి డాక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ..దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, ఫైలేరియా మొదలగు వ్యాధులు, అవి సోకడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత, డ్రైడే పాటించాలని తద్వారా ఇలాంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళల రక్షణ కోసం శక్తి యాప్.



**ఆంధ్ర ప్రగతి మహానంది ఆగస్టు 20:**మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం శక్తి యాప్ రూపొందించిందని నంద్యాల శక్తి టీం హెడ్ కానిస్టేబుళ్లు, ప్రసాద్, రఫీ, వెంకటేశ్వర్లు, మహిళా పోలీస్ స్నేహలత పేర్కొన్నారు. బుధవారం మహానంది మండలం గోపవరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థినిలకు ఏఎస్పి జావలి ఆదేశాల మేరకు మహిళల చట్టాలు, శక్తి యాప్,100,110, మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాల పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అత్యవసర సమయంలో మహిళలకు శక్తి యాప్ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ప్రతి మహిళా శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు.విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, బాగా చదువుకొని, పాఠశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు.సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని,బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని తెలియజేశారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.వన్ స్టాప్ సెంటర్ ద్వారా బాధిత మహిళలకు న్యాయ సహాయం, వైద్య, కౌన్సిలింగ్ వంటి సేవలు కల్పించడం లీగల్ వంటి విభాగాలతో సమన్వయం చెయ్యడం జరురుతుందన్నారు.ఈ కార్యక్రమంలోప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వినాయక చవితి పండుగను లో ఎలాంటి సంఘటనలు
# జరుగకుండా జాగ్రతలు తీసుకోవాలి.

**నేర నియంత్రనే లక్ష్యంగా అందరూ పని చేయాలి.**

**కేసులనమోదు,దర్యాప్తులో అత్యాధునిక సాంకేతికతను E sakshya అప్లికేషన్ ను ఉపయోగించాలి.**

**మహిళలు/చిన్నారులపై జరిగే నేరాల నివారణకు ప్రతిష్ట చర్యలు తీసుకోవాలి.**

**జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ ఆగస్టు 20:** నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయం నందు నేర సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రనే లక్ష్యంగా పని చేయాలని, రానున్న వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రతలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అధికారులను ఆదేశించారు.

ఈ సంధర్భంగా జిల్లాలోని నంద్యాల ,ఆళ్లగడ్డ ,ఆత్మకూరు, డోన్ డిఎస్పీలు, సిఐలు, ఎస్సైల తో మాట్లాడుతూ వారి వారి పోలీస్ స్టేషన్లలో ఉన్న పెండింగ్ కేసులను సీసీటీఎంఎస్ ఆధారంగా జిల్లా ఎస్పీ సమీక్షించి ఆరా తీశారు.కేసుల నమోదు దర్యాప్తులలో తప్పనిసరిగా ఈ సాక్ష అప్లికేషన్ ను ఉపయోగించి సాక్షదాయాలను అప్లోడ్ చేయాలని ఆదేశించారు. నేర పరిశోధన మరియు న్యాయ ప్రక్రియలో ఎలక్ట్రానిక్ పరికరాలు, డిజిటల్ రికార్డులు మరియు ఆన్లైన్ డేటా వంటివి సాక్ష్యాలుగా ఉంటూ నేరస్తులకు శిక్ష పడుటలో న్యాయ వ్యవస్థను మరింత సమర్థవంతంగా, పారదర్శకం మరియు వేగవంతంగా మార్చడానికి ఉపయోగపడుతుంది. సీసీటీఎన్ఎస్ ఆధారంగా కేసుల పెండింగ్ కు గల కారణాలను, కేసుల దర్యాప్తులో తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సలహాలు, సూచనలు చేశారు. రానున్న వినాయక చవితి పండుగను పురస్కరించుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గణేష్ ఉత్సవాలలో డీజీలు వాడ రాదని సమస్యాత్మకమైన ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైతే పాత నేరస్తులను బైండోవర్ చేయాలి.

వినాయక ఉత్సవ కమిటీ వారితో మరియు పీస్ కమిటీ వారితో సమావేశం ఏర్పాటు చేసి వినాయక విగ్రహ ప్రతిష్ట నుండి నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి. మీ స్టేషన్ పరిధిలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాల గురించిన పూర్తి సమాచారం స్టేషన్ అధికారి వద్ద ఉంచుకోవాలి. ముఖ్యమైన సమస్య ఆత్మకమైన ప్రాంతాలలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలకు కానిస్టేబుల్ను ఏర్పాటు చేసి తగు జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలి. పోలీస్ స్టేషన్ లో నమోదయ్యే ప్రతి కేసు వివరాలను క్షుణ్ణంగా సిసిటిఎన్ఎస్ లో ఎప్పటికప్పుడు పొందుపరచాలని అన్ని వివరాలు నమోదు చేయడం వలన కేసుల పూర్తి సమాచారం తెలుస్తుందని అది అందరికీ ఉపయోగపడేలా దోహదం చేస్తుందన్నారు. గ్రేవ్ కేసులు, యు ఐ కేసులు, పిటి కేసులు, మర్డర్, సైబర్ క్రైమ్, ఫోక్సో, మిస్సింగ్ కేసులు ,ఎస్సీ ఎస్టీ కేసులపై ఆరా తీస్తూ వాటి దర్యాప్తు పురోగతిపై ప్రత్యేక దృష్టి ఉంచాలని,ప్రాధాన్యత గల కేసులలో ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా భాదితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు విస్తృత అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో పాటు, ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో,రోడ్డు మలుపులలో రేడియం స్టిక్కర్స్, బారికేడ్స్, జిగ్ జాగ్ డ్రమ్స్ , స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని, రోడ్డు మలుపుల వద్ద అడ్డుగా ఉన్న ముళ్లపదలను తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. మిస్సింగ్ కేసులు, పోక్సో, మహిళల పై జరిగే నేరాల నివారణ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఇటువంటి కేసుల గురించి సిబ్బందికి బ్రీఫింగ్ చేస్తూ అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పి మంద జావళి ఆల్ఫోన్స్ ,స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్.పి శ్రీనివాస రెడ్డి, డి.ఎస్.పి లు ప్రమోద్ కుమార్, రామంజి నాయక్,శ్రీనివాస్ జిల్లాలోని ఇన్స్పెక్టర్లు ,సబ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

# సి.పి.ఆర్ నేర్చుకుందాం నిండు ప్రాణాన్ని కాపాడుదాం.

**డాక్టర్ సునీత ఆధ్వర్యంలో బాల అకాడమీలో విద్యార్థులకు సి.పి.ఆర్ పై అవగాహన సదస్సు.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ ఆగస్టు 20:**

నేటి ఆధునిక జీవన విధానంలో జీవన ప్రమాణాలు తగ్గిపోతున్నాయి. గుండెపోటుతో మరణించే వారి సంఖ్య పెరిగిపోతున్నది. ఒక వ్యక్తి యొక్క గుండె ఆగిపోయినప్పుడు లేదా శ్వాస తీసుకోవడం ఆగిపోయినప్పుడు వారి ప్రాణాలను కాపాడడానికి చేసే ఒక అత్యవసర చికిత్స సి.పి. ఆర్. మణిదీప్ మువ్వల మరియు ధ్రువన్ జి రెడ్డి అనే విద్యార్థులు అతి చిన్న వయసులోనే ఆదర్శ సేవా దృక్పథంతో అమెరికా నుండి భారత్ కు వచ్చి ఆంధ్రప్రదేశ్ లోఎన్నో పాఠశాలను సందర్శించి విద్యార్థులకు సి.పి.ఆర్ పై అవగాహన కలిగిస్తూ విద్యార్థులందరికీ స్ఫూర్తిని అందిస్తున్నారు. ఈ సందర్భంగా బాల అకాడమీ కి విచ్చేసి సి.పి.ఆర్ ను ఎలా చేయాలి, దాని వలన కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు అర్థమయ్యేలా తెలిపారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు డాక్టర్ సునీత సమాధానాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులకు రజనీ ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ సందర్భంగా బాలకాడమీ ప్రిన్సిపల్ మాధవి లత మాట్లాడుతూ.. సిపిఆర్ పై అవగాహన కలిగించి, విద్యార్థులను ప్రోత్సహించినందుకు మెడ్ ఇంపాక్ట్ బృందానికి కృతజ్ఞతలు తెలియజేయడంతో పాటు విద్యార్థులు మణిదీప్ మువ్వల మరియు ధ్రువన్ జి రెడ్డి ని సత్కరించి సన్మానించారు.

ప్రాణాలను రక్షించడానికి యువతను శక్తివంతం చేయడం– సి.పి.ఆర్ ప్రధాన లక్ష్యం.

## ఆటో డ్రైవర్ల జిల్లా జనరల్ బాడీ సమావేశంలో
# పాల్గొని జయప్రదం చేయండి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 20:**
నంద్యాల పట్టణంలోని మీనాక్షి సెంటర్లోని ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ హాజరవ్వగా ఈ కార్యక్రమంలో 20 మందికి పైగా నందమూరి నగర్, వైఎస్ఆర్ నగర్, పులిమద్ది గ్రామాల ఆటో డ్రైవర్ లు పాల్గొనడం జరిగింది. అనంతరం ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో 30 వేలకు పైగా ఆటోలు ఉన్నాయని, ఈ ఆటో డ్రైవర్ల మీద ఆధారపడిన కుటుంబాలు దాదాపుగా లక్ష మందికి పైగా ఆధారపడి జీవిస్తూ ఉంటారు. ఇటువంటి వాళ్ళ జీవితం ప్రభుత్వం మరింత దిగజార్చే స్థాయికి తీసుకువస్తుంది. మహిళలకు ఉచిత బస్సు పథకం మంచిదే ఆహ్వానిస్తున్నాము. అయితే ప్రయాణికుల పైన ఆధారపడిన ఆటో డ్రైవర్ల పరిస్థితి ఏంటి? ఇప్పటికే ఆటో డ్రైవర్ల పైన పోలీసుల, ఆర్టీవో అధికారుల దాడులు విపరీతంగా పెరిగిపోయి చలానాలు, జరిమానాలు వేలల్లో వేయడం ద్వారా కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇవి చాలదు అన్నట్లు ఇప్పుడు ఈ పథకం అమలు అయితే ఆటోలను అమ్ముకోవాల్సిన పరిస్థితి ప్రభుత్వమే తీసుకువస్తుంది. కాబట్టి ఆటో డ్రైవర్లను ఆదుకునేందుకు గతంలో వాహన మిత్ర పథకం ద్వారా 10వేలు ఇచ్చి ప్రభుత్వం ఎంతోకొంత లబ్ధి చేకూర్చేది అది పూర్తిగా ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎత్తివేయడం జరిగింది. కాబట్టి మళ్లీ ఆ పథకాన్ని పునరుద్ధరించేలా ఆటో ఉన్న డ్రైవర్ కు కనీసం 25000 సంవత్సరానికి ఇచ్చి ఆదుకుంటే ఆటో డ్రైవర్ల కుటుంబాలు కొంత అప్పుల పాలు కాకుండా ఈఎంఐ లు కట్టుకుని సాఫీగా సాగే అవకాశం ఉందని అన్నారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై 21వ తేదీన సిఐటియు కార్యాలయం ముందు జరిగే జిల్లా జనరల్ బాడీ సమావేశంలో చర్చించి రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల ఆదుకోవడం కోసం చేయాల్సిన పోరాటాలను భవిష్యత్ కార్యాచరణ నిర్దేశించుకుని ఆటో డ్రైవర్లను ఐక్యం చేయడం కోసం కృషి జరుగుతుందని, రేపు జరిగే జనరల్ బాడీ సమావేశంలో ఆటో డ్రైవర్లు అంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశానికి ఆలిండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్,ఏపీ అండ్ ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్, కర్నూలు జిల్లా కార్యదర్శి ప్రభాకర్ పాల్గొంటారని తెలియజేశారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



## శ్రీశైలం శిఖరం అటవీ అధికారులపై దాడి చేసిన

# ఎమ్మెల్యే బుడ్డా అనుచరులు..!

బుడ్డా రాజశేఖర రెడ్డి అనుచరులు మంగళవారం రాత్రి దౌర్జన్యం - శ్రీశైలం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు..!

ఎర్రగొండపాలెం అటవీ పరిధిలోని నక్కంటి అటవీ అధికారులైన ఉప అటవీ క్షేత్రాధికారి, బీట్ అధికారులు తీవ్రంగా దెబ్బలు..!

వాకీటాకీలు, మొబైల్స్, తీసుకున్నారని ఆరోపణలు..! -అటవీ ఉద్యోగ సంఘాలు తీవ్ర ఖండన

ఎమ్మెల్యే బుడ్డా అనుచరులపై బుడ్డా పై కఠిన చర్యల డిమాండ్..!






**ఆంధ్ర ప్రగతి శ్రీశైలం ఆగస్టు 20:** నంద్యాల జిల్లా శ్రీశైలం మండలం శిఖరేశ్వరం అటవీశాఖ చెక్ పోస్ట్ మంగళవారం రాత్రి శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అటవీ శాఖ సిబ్బందిపై దాడి చేసిన సంఘటన సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది మంగళవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో శ్రీశైలం సమీపంలోని శిఖరేశ్వరం అటవీశాఖ చెక్పోస్ట్ సిబ్బందిపై ఎమ్మెల్యే బుడ్డా వారి అనుచరులు శ్రీశైలం శిఖరం వద్ద అటవీ అధికారులను బంధించి దాడి చేసి అటవీ పరిధిలోని నక్కంటి అటవీ అధికారులైన ఉప



అటవీ క్షేత్రాధికారి, బీట్ అధికారులు తీవ్రంగా దెబ్బలు తగినట్లు సమాచారం స్వయంగా వాళ్ళ వాహనాలను బుడ్డా రాజశేఖర్ రెడ్డి తోలుకుంటూ పోయినట్లు అటవీ శాఖ సిబ్బంది అధికారులు తెలిపారు వాకీటాకీలు, మొబైల్స్, తీసుకున్నారని వెళ్లారని ఆరోపణలు అటవీ ఉద్యోగ సంఘాలు తీవ్ర ఖండన కఠిన చర్యల డిమాండ్ శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ పై కేసులు నమోదు చేయాలని వారి డిమాండ్ దీనిపై కూటమి ప్రభుత్వం నాయకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మరియు అటవీ శాఖ మంత్రి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ గారు బుడ్డా రాజశేఖర్ రెడ్డి పై మరియు వారి అనుచరులపై ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూద్దాం.?

# పర్యావరణ హితంగా వినాయక చవితి జరుపుకోవాలి.

## -డా" రామకృష్ణా రెడ్డి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 20:**
విశ్వ హిందూ పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2025 సంవత్సరం వినాయక చవితి ఉత్సవాలు పర్యావరణ హితంగా,భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని నంద్యాల జిల్లా గౌరవాధ్యక్షుడు,ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.

రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు,నంద్యాల జిల్లా కార్యధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వర్ రెడ్డి గారు మాట్లాడుతూ ఈ సంవత్సరం రాష్ట్రంలో కొత్తగా ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ కమిటీ ఏర్పడింది.దానికి అనుబంధంగా జిల్లా కమిటీలు, తాలూకా




కమిటీలు,మండల కమిటీలు, గ్రామ కమిటీలు ఒకదాని ఒకటి అనుసంధానించబడి ఈ సంవత్సరం వినాయక చవితిని ఎటువంటి సమస్యలు,ఆటంకాలు లేకుండా తగిన జాగ్రత్తలతో ప్రశాంతంగా జరుపుకోవాలని చెప్పారు.ప్రభుత్వ యంత్రాంగం కూడా వినాయక చవితికి రాష్ట్రవ్యాప్తంగా, జిల్లా వ్యాప్తంగా మండప నిర్వాహకులకు అన్ని సహాయ సహకారాలు అందించాలని,



అనుమతులు,రిజిస్ట్రేషన్లు,ఆన్లైన్లో పేరిట ఇబ్బందులు పెట్టరాదని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు,సమన్వయ కార్యదర్శి పోలేపల్లి సందీప్, ఉపాధ్యక్షుడు ఎర్రం విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు అభిరుచి మధు, రాంప్రసాద్,రాజశేఖర్ రెడ్డి,మహేశ్వర్ రెడ్డి,జిల్లా స్థాయి కార్యకర్తలు పాల్గొన్నారు.

# వీధి కుక్కల పెరుగుదల వలన పిల్లలు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 20:**
సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా నంద్యాల జిల్లా అధ్యక్షులు మణిహారం హనీఫ్ పత్రికా సమావేశంలో మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి పూట గుంపులుగా తిరిగే ఈ కుక్కలు చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలపై దాడులు చేసి భయాందోళనలు సృష్టిస్తున్నాయి. ఇప్పటికే అనేక చోట్ల కుక్కల దాడులతో గాయాలపాలైన,




చిన్న పిల్లల ప్రాణాలు పోయినఘటనలు చోటుచేసుకున్నాయి. ప్రజల ప్రాణాలను కాపాడి, సురక్షిత వాతావరణం కల్పించడం ప్రభుత్వానికి మొదటి బాధ్యత. కానీ నంద్యాల జిల్లాలో ఈ సమస్యను ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేయడం ద్వారా ప్రభుత్వం ప్రజల ప్రాణలను, భద్రతను ప్రమాదంలో పడేస్తోంది అని తెలిపారు.

నంద్యాల జిల్లా ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ, వెంటనే తగిన చర్యలు తీసుకుని వీధి కుక్కల సమస్యను నియంత్రించాలని డిమాండ్ చేస్తున్నామని లేనిపక్షంలో ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని తెలియజేశారు. ఈ పత్రికా సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎజాస్ హుస్సేన్ ఉపాధ్యక్షులు అబ్దుల్ కలాం, కార్యదర్శులు ఎం సుల్తాన్, టీ కరిముల్లా పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలి.


## ఎస్సీ ఎస్టీలపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు. -జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు 20:**
జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్ పేర్కొన్నారు.

బుధవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో సాంఘిక సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లా నిఘా మరియు పర్యవేక్షణ కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ సి విష్ణు చరణ్ మాట్లాడుతూ.... నంద్యాల జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ ల పై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అణగారిన వర్గాలలో జరుగుతున్న అన్యాయాలపై రాజ్యాంగ విలువలు, హక్కులను కాపాడేందుకు కమిటీ సభ్యులు కృషి చేయాలని కోరారు. జిల్లాలోని నియోజకవర్గాల వారీగా ఎస్సీ ఎస్టీ ల గ్రామాల వివరాలు సేకరించి




అక్కడ జరుగుతున్న అన్యాయాలపై ప్రత్యేక చర్యలు తీసుకునే విధంగా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరు పాటించి దళితులకు ఎక్కడా అన్యాయం చోటు చేసుకోకుండా చూడాలన్నారు.జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా అధికారులు పారదర్శకంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలన్నారు. దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని రకాల అవకాశాలను కల్పిస్తోందని



ఎక్కడ వారు అన్యాయానికి గురి కాకుండా చూడాలన్నారు. జిల్లాలోనిపోలీస్, రెవెన్యూ, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వయంతో పనిచేసి ఎస్సీ, ఎస్టీ వర్గాలపై నమోదయిన కేసుల్లో జాప్యాన్ని నివారించి సత్వర న్యాయం అందించాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, డీఎస్పీలు, డివిఎంసి సభ్యులు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ లోని బేడ బుడగ జంగం వారిని ఎస్ సి జాబితాలో చేర్చండి.

## కేంద్ర మంత్రితో సమావేశమైన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఆగస్టు 20:**
ఆంధ్రప్రదేశ్ లో అత్యంత వెనుకబడి సంచార జాతిగా కొనసాగుతున్న బేడ బుడగ జంగం కమ్యూనిటీని షెడ్యూల్డ్ కాస్ట్ ( ఎస్. సి ) జాబితాలో కేంద్ర ప్రభుత్వం చేర్చి వారికీ న్యాయం చేయాలని కోరుతూ బుధవారం న్యూ ఢిల్లీలో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత మంత్రి డాక్టర్. వీరేంద్ర కుమార్ ను నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి కలసి వినతి పత్రం సమర్పించారు.



ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వలో రాష్ట్రం లోని బేడ బుడగ జంగం కులస్తులను ఎస్ సి జాబితాలో చేర్చాలని అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపడం జరిగిందని కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని "బెడ బుడగ జంగం కమ్యూనిటీని షెడ్యూల్డ్ కాస్ట్ జాబితాలో చేర్చే ప్రతిపాదనపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని" కోరుతున్నామన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే దీన్ని సిఫారసు చేసిందని, ఈ ప్రతిపాదన ఆమోదం లభిస్తే, చాలా కాలంగా న్యాయం కోసం ఎదురుచూస్తున్న ఈ వెనుకబడిన వర్గానికి న్యాయం జరుగుతుందని కేంద్ర మంత్రికి వివరించామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు.

# కౌతాళం మండలంలో రద్దు చేసిన వికలాంగుల పింఛను తిరిగి ఇవ్వాలి.



**ఆంధ్ర ప్రగతి కౌతాళం ఆగస్టు 20:** మంచానికి పరిమితమైన, రెండు కళ్ళు లేకపోయినా, కాళ్లు, చేతులు లేకపోయినా, అవయాలు ఏమి పని చేయకపోయినా పింఛన్లు రద్దు చేయడం అన్యాయం అని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే మల్లయ్య అన్నారు. మండలంలో 129 మందికి పింఛన్లు తీసేయడం చాలా దుర్గా దుర్మార్గమైన పని అని కూటమి ప్రభుత్వం అంగ వీకలా ల వాళ్లుపై కోపం చూపించడం సరైనది కాదని ఆయన అన్నారు. వీళ్లకు వికలాంగుల శాతము 100, 90% శాతం ఉన్న పింఛన్లు కూడా తీసి వేసినారు .వీళ్లకు 20 సంవత్సరాలు నుంచి 75 రూపాయలు పింఛన్లు తీసుకున్నటువంటి వికలాంగుల పింఛన్ సైతం తీసివేయడం చాలా దుర్మార్గమైన సంఘటనని ఆయన అన్నారు. వీళ్ళ జీవనాధారం పింఛను మీదే ఆధారం, పుట్టుకతోనే వికలాంగులకు అయినా కూటమి ప్రభుత్వం వీళ్లపై కక్ష కట్టి పింఛన్లు రద్దు చేయడం సరైనది కాదని ఆయన అన్నారు. తీసివేసిన వాళ్ల పింఛన్లను తిరిగి ఇవ్వకపోతే రాష్ట్రవ్యాప్తంగా వికలాంగులందర్నీ పోగుచేసి రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేయవలసి వస్తుందని కే మల్లయ్య హెచ్చరించినారు.

# రాష్ట్ర సేవికా సమితి కార్యక్రమాలు స్ఫూర్తిదాయకం.

## ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఆగస్టు 20:**
రాష్ట్ర సేవికా సమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో న్యూ ఢిల్లీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలు స్ఫూర్తి దాయకమని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.బుధవారం న్యూ ఢిల్లీ లో రాష్ట్ర సేవికా సమితి' మహిళా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్ఫూర్తిదాయక కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యే అవకాశం కల్పించిన సహచర మహిళా పార్లమెంట్ సభ్యులు, ప్రత్యేకించి బాలివుడ్ నటి, ఎంపీ కంగానా రానాట్ కు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ధన్యవాదాలు. చెప్పారు.



## మదర్సాలలో విద్యా వాలంటీర్లను నియమించాలంటూ

# మంత్రి ఫరూక్ కు వినతి పత్రం.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 20:**నంద్యాల టిడిపి కార్యాలయం నందు మదర్సాలలో విద్యా వాలంటీర్లను నియమించి "చంద్రన్న మదరస నవీన విద్యావిధానం" అమలు చేయులని మైనారిటి మరియు న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫారుక్ కు మదర్సా అసోసియేషన్ ప్రతినిధులు వినతి పత్రం ఇవ్వడమైనది. ఈ సమస్యపై మంత్రి ఫరూక్ సానుకూలంగా స్పందించారు.

ఈ కార్యక్రమంచి యూనిమ్ ప్రెసిడెంట్ ఎస్ఎండి ఆరిఫ్, మదర్సా అసోసియేషన్ వైస్ ప్రసిడెంట్ బాను, కార్యదర్శి, రిహనా పర్వీన్ , ఖాజా, సెక్రటరీ కౌసర్ , శంశాద్ , మైమునా, మొమిన్, ముంతాజ్ మరియు 60 మంది నాజీమ్స్ మరియు విద్యా వాలంటర్లు పాల్గన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
గురువారం 21 ఆగస్టు 2025

# ఏపీఎస్పీసిఎల్ సోలార్ కు కేటాయించిన భూములను పరిశీలించిన జేసి విష్ణు చరణ్.



**ఆంధ్ర ప్రగతి గడివేముల, ఆగస్టు 20:**
గడివేముల మండలం గని గ్రామం నందు గతములో సర్వే నెం. 748ఏ లో 599.60 ఎకరాల భూమి ఏపీ ఎస్పీసీఎల్ సోలార్ వారికి కేటాయించడం జరిగింది. ఈ భూమిని జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కేటాయించిన భూముల మ్యాపులను, వాటి సరిహద్దులను పరిశీలించారు. సోలార్ కు కేటాయించిన భూమికి సంబంధించిన పలు అంశాలను క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, వి. ఆర్.ఓ, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో స్మశాన సేవకులకు (కాటికపరులలకు) కిట్ల పంపిణీ.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 20:** నంద్యాల మున్సిపాలిటీ హిందూ శ్మశాన వాటిక ఇక్కడ పనిచేస్తున్నటువంటి శ్మశాన సేవకులు (కాటికాపరులకు) వాళ్ళు చేస్తున్నటువంటి సేవలకు గుర్తింపుగా ఈరోజు రెడ్ క్రాస్ జిల్లా ప్రెసిడెంట్ గౌరవ జిల్లా కలెక్టర్ రాజకుమారి సలహా మేరకు రెడ్ క్రాస్ సొసైటీ మరియు భారతీయ వైద్యుల సంఘం నంద్యాల శాఖ కలిసి ఇక్కడ పనిచేస్తున్న 11 మందికి వంట సామగ్రి, దోమతెరలు, దుప్పట్లు, ప్లాస్టిక్ బకెట్లు, ఉపయోగకరమైన ఇంకా కొన్ని వస్తువులను వీళ్లకు ఇవ్వడం జరిగింది. డాక్టర్ మధుసూదన్ రావు మాట్లాడుతూ.. రెండు రోజుల క్రిందట బస్టాండ్లో ఒక గుర్తు తెలియని వ్యక్తి హఠాన్ మరణం చెంది అక్కడే కుప్పకూలి చనిపోయాడు అటువంటి అతని ఆచూకీ ఏమి తెలియలేదు ఆ అనాథ మృతదేహాన్ని స్వర్గధామం లో పనిచేస్తున్న సేవకులు స్వయంగా మోసుకుని వచ్చి ఇక్కడ అతనికి గౌరవప్రదమైన అంత్యక్రియలను చేయడం జరిగింది ఇది వారి యొక్క మానవత సేవా దృక్పథాన్ని తెలుపుతుంది వారి సేవ నిరతికి ఎవరూ చేయని చివరి అంత్యక్రియ సేవలను ఇక్కడ మున్సిపల్ హిందూ స్మశాన వాటిక స్వర్గధామం నందు చేస్తూ ఉన్నారు వారి అభివృద్ధికి అందరూ సహాయపడాలని కోరుతూ ఈ కార్యక్రమంలో డాక్టర్ చిత్తలూరు మధుసూదనరావు అధ్యక్షులు భారతీయ వైద్య సంఘం నంద్యాల, దస్తగిరి మాజీ అధ్యక్షులు, రెడ్ క్రాస్ సొసైటీ, రెడ్ క్రాస్ మాజీ ట్రెజరర్ నాగేశ్వరావు, రెడ్ క్రాస్ ఆర్గాన్ డొనేషన్ మోటివేషన్ కోఆర్డినేటర్ ఆనంద్ గురూజీ, చిత్తలూరు రామ ప్రసాదు, ద్వారక వసంతు, నరసింహ సభ్యులు పాల్గొనడం జరిగింది.

# ఈ పాసు పుస్తకాలను పరిశీలిస్తున్న రెవెన్యూ యంత్రాంగం.



**ఆంధ్ర ప్రగతి మహానంది ఆగస్టు 20:** గతంలో రీ సర్వే జరిగిన గ్రామాలకు సంబంధించి ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేసిన ఈ పాస్ పుస్తకాలను రెవెన్యూ యంత్రాంగం పరిశీలన చేపట్టింది. ఇందులో భాగంగానే మహానంది మండల తహసిల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు భూమి యాజమాన్యపు హక్కు పత్రాలు/ పట్టాదారు పాసుపుస్తకం పరిశీలించే కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలోని నంది పల్లె, మసీదుపురం ,బసాపురం గ్రామాలకు సంబంధించి ఈ పాస్ పుస్తకాలను ప్రభుత్వం విడుదల చేసింది. గత ప్రభుత్వ హయాంలో రీ సర్వే అనంతరం అందజేసిన పాస్ పుస్తకాల స్థానంలో వాటిని రద్దుచేసి ప్రస్తుతం ప్రభుత్వం నూతనంగా రాజముద్ర కలిగిన వీటిని రైతులకు అందజేయనున్నట్లు తెలుస్తుంది. గ్రామాల్లో రైతులు ఎందరు వారి పేర్లు, సర్వే నెంబర్లు, విస్తీర్ణం సరిగా ఉన్నాయా లేదా ఎంతమంది రైతులకు నూతనంగా ప్రభుత్వం విడుదల చేసిన ఈ పాస్ పుస్తకాలు వచ్చాయి వాటిల్లో ఏమైనా తేడాలు ఉన్నాయా, ఇంకా ఎంతమంది రైతుల పేరు పై ఈ పాస్ పుస్తకాలు రావాల్సి ఉంది తదితర అంశాలపై కూలంకషంగా పరిశీలన చేస్తున్నట్లు తెలుస్తుంది. వీటన్నింటినీ పరిశీలించి జిల్లా స్థాయి ఉన్నత అధికారులకు పూర్తి సమాచారాన్ని స్థానిక అధికారులు నివేదిక అందజేయనున్నట్లు సమాచారం .పరిశీలన అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో పంపిణీ చేయనున్నట్లు తెలుస్తుంది. స్థానిక ఎమ్మెల్యే లేదా ఉన్నత స్థాయి అధికారుల చేతుల మీదుగా వీటిని రైతులకు ఎప్పుడు పంపిణీ చేస్తారు అనేది తెలియాల్సి ఉంది.

## రాష్ట్రంలో ఎవరూ సంతోషంగా లేరు: బొత్స సత్యనారాయణ

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు మౌనంగా ఉన్నారని శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. రాష్ట్రంలో పాలన పూర్తిగా గాడి తప్పిందని, ఏ వర్గం కూడా ప్రభుత్వ పనితీరుతో సంతోషంగా లేదని ఆయన విమర్శించారు.
విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే విషయంలో తమకు రెండు నాల్కల ధోరణి లేదని బొత్స స్పష్టం చేశారు. కేంద్రం ప్రకటించిన ప్యాకేజీతో ప్లాంట్ అప్పులు తీర్చిన తర్వాత దాన్ని ప్రైవేటుకు అప్పగించే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఢిల్లీ పర్యటనల్లో చంద్రబాబు ఈ కీలక అంశంపై ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు.

# మలేరియాను కనుగొన్న శాస్త్రవేత్త సర్ రోనాల్డ్ రాస్ సేవలు చిరస్మరణీయం.

## డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్. -సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫీ.

**ఆంధ్ర ప్రగతి డోన్ ఆగస్టు 20:**
ఆగష్టు 20 న ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా..డోన్ పట్టణంలో 14వ సచివాలయం నందుడోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, 14వ సచివాలయ అడ్మిన్ వరలక్ష్మి , రమేష్ అద్యక్షతన
సామాజిక కార్యకర్త పి.మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో మలేరియా దోమల నుంచి వ్యాప్తి చెందుతుందని కనుక్కున్న శాస్త్రవేత్త సర్ రోనాల్డ్ రాస్– ఆగస్టు 20 మలేరియాను గుర్తించిన రోజు సందర్భంగా వారి చిత్ర పటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు. వారిని స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీలు మద్దిలేటి రమేష్, మంజువాణి, ఏఎన్ఎం సుజాత, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూమన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు
సర్ రోనాల్డ్ రాస్ 13 మే, 1857 జన్మించారు. ఈయన వైద్యుడు, శాస్త్రవేత్త. ఇతనికి మలేరియా పారసైట్ జీవితచక్రానికి చెందిన పరిశోధనకు గాను 1902లో వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతి ప్రధానం చేయబడింది. 1897 లో ఒక దోమ యొక్క జీర్ణశయాంతర ప్రేగులలో మలేరియా పరాన్నజీవిని ఆయన కనుగొన్నప్పుడు మలేరియా దోమల ద్వారా వ్యాపిస్తుందని ఋజువు చేసింది. ఈ వ్యాధిని ఎదుర్కునే పద్ధతికి పునాది వేసింది. అతను బహుముఖ ప్రజ్ఞాశాలి. భారతీయ వైద్య సేవలో 25 సంవత్సరాలు



పనిచేశాడు. తన సేవలోనే అతను సంచలనాత్మక వైద్య ఆవిష్కరణ చేశాడు.సర్ రోనాల్డ్ రాస్ 16 సెప్టెంబర్, 1932 స్వర్గస్తులైనారు. ఇలాంటి మహానుభావులను ఎల్లవేళల స్మరించుకుంటు వారి అడుగుజాడలలో నడవాలని డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి కోరారు. దోమల ద్వారా సంక్రమించే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ ,సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి , 14వ సచివాలయ సెక్రటరీలు ప్రజలకు అవగాహన కల్పించారు.దోమలు వాటి నుండి సంక్రమించే వ్యాధుల గురించి, వాటిని నిరోధించే మార్గాల గురించి అవగాహన పెంచడానికి ఆగస్టు 20న ప్రపంచ దోమల నివారణ దినోత్సవం జరుపుతున్నారని డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్,సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి పేర్కొన్నారు.దోమ కాటు చాలా ప్రమాదకరమైంది. దోమ కాటు ద్వారా వ్యాపించే వ్యాదులు మెదడు వాపు,మలేరియా,
చికిన్ గున్య ,డెంగ్యూ ,ఎల్లో ఫీవర్ మొదలగు వ్యాధులు వ్యాపిస్తాయి. వాటిని తరిమికొట్టాలంటే పరిసరాల పరిశుభ్రతతోనే సాధ్యం. విషజ్వరాల
నుండి కాపాడుకోవాలంటే దోమల నివారణకు ప్రజలందరు భాగస్వాములు కావాలి. అప్పుడే విషజ్వరాల నుండి కాపాడుకోగలమని డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్,సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు.
దోమల నిర్మూలనతో పై వ్యాదుల వ్యాప్తిని నివారించవచ్చు.దోమల నివారణకై అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలి. పరిసరాలను వీలైనంత వరకూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందుతాయి. కాబట్టి నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలి. దోమలు ఇంట్లోకి రాకుండా కిటికీలు, వెంటీలేటర్లకు నెట్ అమర్చుకోవాలి. దోమలు ఉన్నాయనుకున్నపుడు క్రిమి సంహారక మందులు చల్లాలి. దోమతెరలను ఉపయోగించాలి.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మొక్కల కుండీలు, పూల కుండీలలో నీళ్లు ఎప్పటికప్పుడు మారుస్తూ ఉండాలి. కూలర్లలోని నీటిని ఎప్పటికప్పుడు మారుస్తు ఉండాలి. వాటిలో నీళు తీయడంలో అశ్రద్ధ చేస్తే ఆ నీటిలో దోమలు వృద్ధి చెందేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా మూత పెట్టుకోవాలని డోన్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు.

# యూరియా కోసం..రోడ్డెక్కిన అన్నదాతలు.

## ప్రజాప్రభుత్వంలో.. ఎందుకు ఇలా.? -వెలుగోడు-నంద్యాల రహదారిపై నిరసన.






**ఆంధ్ర ప్రగతి వెలుగోడు ,ఆగష్టు20:**
యూరియా కోసం అన్నదాతలు రోడ్డెక్కారు.బుధవారం మండల కేంద్రమైన వెలుగోడులో సొసైటీ దగ్గర యూరియా కోసం రైతులు ఉదయం నుంచే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది.రైతులకు ఎంతసేపటికి సొసైటీ సిబ్బంది యూరియా ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన అన్నదాతలు వెలుగోడు-నంద్యాల ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు.గత ప్రభుత్వ హయాంలో రైతులకు అన్ని ఎరువులు పుష్కలంగా అందాయని ప్రస్తుతం రైతులకు కనీసం యూరియా దొరకడం లేదని మండిపడ్డారు.యూరియా రైతులకు ఇవ్వకుండా బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నారని రైతులు ఆరోపించారు.మండల పరిధిలోని బోయిరేవుల, మెతుకూరు, వెలుగోడు,గుంతకందాల,అబ్దుల్లాపురం, మాధవరం గ్రామాల రైతులు యూరియా కోసం పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు.ఇదిలా ఉండగా వెలుగోడు సొసైటీ కి 400 బస్తాల యూరియా వచ్చినట్లు సొసైటీ అధికారులు తెలిపారు.రైతులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో మండల
వ్యవసాయ శాఖ అధికారి అక్కడికి చేరుకుని ఒక్క రైతుకు ఒక బస్తా యూరియా చొప్పున పంపిణీ చేశారు.కాగా మండలంలోని రైతన్నలు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారు.

# మిథున్ రెడ్డితో ములాఖత్..

# రాజమండ్రికి వెళ్లనున్న జగన్

**లిక్కర్ స్కామ్ లో ఏ4 నిందితుడిగా ఉన్న మిథున్ రెడ్డి**
**ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న వైసీపీ ఎంపీ**
**ఈ నెల 25న రాజమండ్రి సెంట్రల్ జైలుకు వెళ్లనున్న జగన్**




వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ రాజమండ్రి పర్యటనకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టయి, రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న ఆ పార్టీ ఎంపీ మిథున్ రెడ్డిని ఆయన పరామర్శించనున్నారు. ఈ నెల 25వ తేదీన మిథున్ రెడ్డితో జగన్ ములాఖత్ కానున్నారు.
లిక్కర్ కుంభకోణం కేసులో ఏ4 నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న మిథున్ రెడ్డి ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్ లో ఉన్నారు. ఈ నేపథ్యంలో, పార్టీ అధినేతగా ఆయనకు అండగా నిలిచేందుకు జగన్ ఈ పర్యటనను ఖరారు చేసుకున్నట్లు తెలుస్తోంది. జగన్ పర్యటన వివరాలను శాసనమండలిలో ప్రతిపక్ష నేత, వైసీపీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ అధికారికంగా వెల్లడించారు.
మరోవైపు నిన్న బొత్స సత్యనారాయణ, దాడిశెట్టి రాజా, వంగా గీత రాజమండ్రి సెంట్రల్ జైలుకు వెళ్లారు. వారు మిథున్ రెడ్డితో ములాఖత్ అయ్యారు. అనంతరం జైలు నుంచి బయటకు వచ్చిన బొత్స... జగన్ పర్యటనపై ప్రకటన చేశారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# పేదలపక్షపాతి...జస్టిస్ సుదర్శన్ రెడ్డి

**ఆగస్టు 20,ఆంధ్ర ప్రగతి**

ఉప రాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేయడంతో ఎన్నిక అనివార్యం అయ్యింది. బలాబలాలు గమనిస్తే ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్ ఎన్నిక కావడం లాంఛనమే కానుంది. ఎందుకంటే ఎన్‌డిఎ కూటమికి తగినంత బలం ఉంది. అయితే ఇక్కడ అభ్యర్థుల గుణగణాలు, వారి వ్యక్తిత్వం పరిశీలిస్తే ఇద్దరూ వజ్రం తునకలే. వారివారి రంగాల్లో వారు తమ నిజాయితీతో బతుకుతున్న వారే. ఇప్పటివరకు 16 ఉప రాష్ట్రపతి ఎన్నికలు జరిగాయి. సర్వేపల్లి రాధాకృష్ణన్, గోపాల్ స్వరూప్ పాఠక్, జస్టిస్ మహమ్మద్ హిదయతుల్లా, శంకర్‌దయాళ్‌శర్మలు మాత్రమే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన అన్ని ఎన్నికల్లో ప్రతిపక్షాలు అభ్యర్థిని నిలబెట్టాయి. ప్రధానమంత్రిగా మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత 2017లో తొలిసారి జరిగిన ఎన్నికలో అధికారపార్టీ అభ్యర్థి ఎం.వెంకయ్యనాయుడుపైన ప్రతిపక్షాలు గోపాలకృష్ణ గాంధీని నిలబెట్టాయి. 2022లో జరిగిన ఎన్నికలో జగదీప్‌ధన్‌ఖడ్‌పై కర్ణాటకకు చెందిన మార్గరెట్ అల్వాను రంగంలోకి దింపాయి. ఇప్పుడు తెలంగాణకు చెందిన జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని ఎంపిక చేశాయి. ఈ మూడు ఎన్నికల్లో ప్రతిపక్షాల నుంచి దక్షిణాదివారే అభ్యర్థులు కావడం విశేషం.ఈ పోటీ ఎలా ఉన్నా..ఎవరు గెలిచినా విభిన్న వ్యక్తిత్వాల కలగిన ఇద్దరు వ్యక్తుల గుణగణాలను తెలుసుకునే అవకాశం కలిగింది.ప్రధానంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి న్యాయ కోవిదుడు. నిక్కచ్చిగా,నిర్మొహమాటంగా ఉండే వ్యక్తి. ఆయన సుప్రీం న్యాయమూర్తిగా ఇచ్చిన తీర్పులను పరిశీలిస్తే ఇది అర్థం అవుతుంది. జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి దేశంలో పేరొందిన ప్రగతిశీల న్యాయకోవిదుడు. ఆయన సుదీర్ఘ కాలం న్యాయ వ్యవస్థలో ఎన్నో హోదాల్లో పనిచేశారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం నిరంతరం ధైర్యంగా పోరాడారు. అంకుమించి పేదల పక్షపాతిగా పేరుంది. ఆయన రాసిన తీర్పులను చదివితే పేదలకు అనుకూలంగా ఎలా వ్యవహరించారు, రాజ్యాంగాన్ని, ప్రాథమిక హక్కులను ఎలా రక్షించారన్నది తెలుస్తుంది. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో వెంకయ్యనాయుడు తర్వాత పోటీ చేస్తున్న రెండో తెలుగు వ్యక్తిగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి నిలవనున్నారు. జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి 1946 జులై 8న రంగారెడ్డి జిల్లా ఆకుల మైలారంలో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. 1971లో ఉస్మానియా యూనివర్సిటీలో న్యాయశాస్త్రంలో పట్టా పొంది అదే సంవత్సరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. సీనియర్ న్యాయవాది కె.ప్రతాప్‌రెడ్డి వద్ద జూనియర్‌గా చేరారు. హైదరాబాద్ సిటీ- సివిల్‌కోర్టు, హైకోర్టుల్లో న్యాయవాదిగా వృత్తి జీవితం ప్రారంభించారు. 1988-90 మధ్య హైకోర్టులో ఆంధప్రదేశ్ ప్రభుత్వ న్యాయవాదిగా సేవలందించారు. 1990లో సుమారు ఆరు నెలలపాటు- కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు స్టాండింగ్ కౌన్సిల్‌గానూ పనిచేశారు. ఉస్మానియా యూనివర్సిటీకి న్యాయ సలహాదారుగా, స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలందించారు. 1993లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1995 మే 2న ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2005 డిసెంబరు 5న గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి



పొందారు. 2007 జనవరి 12 నుంచి 2011 జులై 7 వరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సేవలందించారు. 2013 మార్చిలో గోవా తొలి లోకాయుక్తగా నియమితులయ్యారు. ఆనాటి గోవా సిఎం పణిక్కర్ ఏరికోరి సుదర్శన్ రెడ్డిని లోకాయుక్తకు నియమించారు. ఓ రకంగా సుదర్శన్ రెడ్డి నిజాయితీ కారణంగానే ఈ పదవి దక్కింది. ప్రస్తుతం ఐఏఎంసీ శాశ్వత ట్రస్టీగా, బీసీ కులగణన అధ్యయన కమిటీ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మానవ హక్కుల పరిరక్షణకు పెద్దపీట వేశారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో పలు కీలక తీర్పులు వెలువరించారు. ఛత్తీస్‌గఢ్‌లో తీవ్రవాదులను ఎదుర్కోవడానికి ఏర్పడిన సల్వాజుడుంను నిషేధిస్తూ తీర్పు ఇచ్చారు. మానవ హక్కుల పరిరక్షణ, చట్టబద్ధ పాలన లక్ష్యంగా ఈ తీర్పు వెలువరించారు. ఆర్మీ వైద్య కళాశాలలో పదవీ విరమణ పొందిన సైనికులు, సైనిక సిబ్బంది వితంతువుల పిల్లలకు అడ్మిషన్‌లు నిరాకరించడం చెల్లదని, దీనివల్ల అణగారిన వర్గాలకు న్యాయం జరగదన్నారు. న్యాయవ్యవస్థ స్వతంత్రతను పరిరక్షిం చడంలో భాగంగా... న్యాయమూర్తులపై ఆరోపణలతో వచ్చే ప్రజాప్రయోజన పిటిషన్‌లను అనుమతించ రాదని పేర్కొన్నారు. హైకోర్టు న్యాయమూర్తిగా ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనానికి నేతృత్వం వహిస్తూ అసైన్డ్ భూసేకరణపై కీలకమైన తీర్పు వెలువరించారు. అసైన్డ్ భూములకు భూసేకరణ చట్టం కింద చట్టబద్ధమైన పరిహారం చెల్లించాలని తీర్పు వెలువరించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఇప్పటి వరకు ఉప రాష్ట్రపతిగా ఉన్న జగదీప్ దన్‌ఖడ్ పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజే రాజీనామా చేశారు. ఈ హఠాత్పరిణామం, ఇప్పటి వరకూ ఒక రాజ్యాంగ హోదాగా భావిస్తున్న ఉప రాష్ట్రపతి పదవి విలువపై చర్చకు దారితీసింది. మరో రాజ్యాంగ వ్యవస్థ అయిన ఎన్నికల కమిషన్ పనితీరుపై దాదాపు నెలరోజులుగా వర్షాకాల సమావేశాలు స్తంభించిపోయాయి. ప్రజల ఓట్లనే కొల్లగొడుతున్నారంటూ ప్రతిపక్షాలు వీధి ఆందోళనలకు దిగాయి. ఈ పరిస్థితుల్లో ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌తో పోటీకి నిలబెట్టేందుకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఇండియా కూటమి ఎంపిక చేసింది. గెలుపోట ములతో నిమిత్తం లేకుండా ఈ పోటీని సైద్ధాంతిక పోరుగా మార్చేందుకు, తమ ఆలోచనా విధానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు తమ నిర్ణయం దోహదపడుతుందని ఆ కూటమి నేతలు భావిస్తున్నట్లు- కనపడుతోంది. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గతంలో నిజాయితీతో నడిచిన న్యాయకోవిదుడు. సుదర్శన్‌రెడ్డి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న నాలుగున్నరేళ్ల కాలంలో అప్పటి యూపీఏ ప్రభుత్వ నిర్ణయాలు చాలా వాటిని తప్పుపట్టారు. సహజవాయువు ప్రజలకు చెందుతుంది. దాన్ని వెలికితీసే కాంట్రాక్టర్ రిలయన్స్ కావచ్చు కాని దాని ధర ప్రభుత్వం నిర్ణయించాల్సిందేనని విస్పష్టంగా తీర్పు చెప్పిన బెంచ్‌లో ఆయన ఉన్నారు. విదేశీ బ్యాంకుల్లో దాచుకున్న నల్లధనాన్ని తిరిగి రప్పించడంలో విఫలమైన ప్రభుత్వాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఆర్థిక నేరస్థులపై ప్రభుత్వం మెతకగా వ్యవహరిస్తోందని ఆక్షేపించారు. వారిపై దర్యాప్తు చేసేందుకు సిట్‌ను నియమించాలని ఆదేశించారు. ఛత్తీస్‌గఢ్‌లో నక్సలైట్లను ఆదివాసీలతోనే తుదముట్టించేందుకు ఏర్పర్చిన సల్వాజుడుంను రాజ్యాంగ వ్యతిరేకమని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సంచలన తీర్పు ఇచ్చారు. సామాన్యులను, ముఖ్యంగా చదువు రాని అమాయక ఆదివాసీ యువతను హింసాకాండకు పాల్పడేందుకు ప్రోత్సహించకూడదని, ఇలాంటి అనైతిక మార్గాలను రాజ్యాంగ విలువలు అనుమతించ బోవని ఆయన విస్పష్టీకరించారు. మొత్తంగా ఇప్పుడుసుదర్శన్ రెడ్డి వ్యక్తిత్వం, అతని తీర్పుల గురించి ప్రజలు తెలుసుకునే అవకాశం వచ్చింది. ఓ రకంగా ఇది సుదర్శన్ రెడ్డ ఔన్నత్యాన్ని వెలుగులోకి తీసుకుని వచ్చే ఎన్నికగా చూడాలి.

## రాధాకృష్ణన్ ఎంపికలో ఆర్ఎస్ఎస్ ప్రధాన పాత్ర

### మోడీ ఏకపక్ష నిర్ణయాలపై కన్నేసిన సంఘ్

**న్యూఢిల్లీ,ఆగస్టు 20,ఆంధ్ర ప్రగతి** మోడీ ప్రధాని అయిన తరవాత బిజెపిలో ఉన్న సీనియర్లను ఒక్కొక్కరినే తప్పిస్తూ తనకు ఎదురులేకుండా చేస్తూ పోతున్నారు. 11 ఏళ్లుగా అదే సాగింది. వాజపేయి - అద్వాణీ తరానికి చెందిన వారందరినీ తప్పించిన తీరును చూశాం. అంతెందుకు అద్వానీనే తప్పించాడు. ఇలా గురుభక్తిని ప్రకటించుకున్నారు. రామ్‌నాథ్ కోవింద్ కాకుండా తొలిసారే అద్వానీని రాష్ట్రపతిగా నిలిపే అవకాశం వచ్చినా తెలివిగా వ్యవహరించారు. దీంతో అద్వానీ రక్తం ధారపోసిన పార్టీలోనే చులకనకు గురయ్యారు. రాజ్యాంగ పదవిని అనుభవించే అవకాశం లేకుండా పోయింది. లేకుంటే మాజీ రాష్ట్రపతిగా అయినా అద్వానీ ఉండేవారు. ఇలా మురళీమనోహర్ జోషి లాంటి వారినికూడా పక్కన పెట్టేశారు. అలాగే వెంకయ్యనాయుడును కూడా ఉపరాష్ట్రపతిని చేసి, ఆయనను కూడా బిజెపికి దూరం చేశారు. ఉపరాష్ట్ర పతి కావడంతో తల్లిలాంటి పార్టీకి దూరం అయ్యానని ఇటీవల వెంకయ్యనాయుడు ఆవేదన చెందారు.

తాజా ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో రాజ్‌నాథ్‌సింగ్‌ను నిలబెడతారని ప్రచారం జరిగింది. దీంతో రాజ్‌నాథ్‌ను కూడా తప్పించే ఎత్తుగడ మొదలయ్యిందని అనుకున్నారు. కానీ అనూహ్యంగా ఆర్ఎస్ఎస్ రంగంలోకి దిగినట్లుగా కనిపిస్తోంది. ఈ మధ్య మోడీ కొంత దూకుడుగా వ్యవహరిస్తూ, ఆర్ఎస్ఎస్‌తో పనేముందన్న రీతిలో సాగారనే విమర్శలు వచ్చాయి. దీంతో 75 ఏళ్ల వ్యవహారంతో మోహన్ భగవత్ ఒక ఝలక్ ఇచ్చారు. అలాగే తెరవెనక కష్టపడుతున్న ఆర్ఎస్ఎస్‌ను కాదని సాగడం కష్టమని సంకేతాలు ఇచ్చారు. ఈక్రమంలో జగదీప్ దన్‌ఖడ్ స్థానంలో మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను ఉపరాష్ట్రపతి పదవికి నరేంద్రమోదీ ప్రభుత్వం ఎంపిక చేయడం చూస్తుంటే ఆర్ఎస్ఎస్ బలంగా తనముద్ర వేసిందని అనుకోవాలి. మామూలుగా



అయితే తనకు నచ్చిన,నమ్మిన బంటును నియమించుకోవడం మోదీ అలవాటు చేసుకున్నారు. అయితే ఇటీవలి కాలంలో కీలకమైన పదవుల్లో ఆరెస్సెస్ నేపథ్యం ఉన్నవారిని నియమించి, ఆ సంస్థను సంతృప్తిపరిచే ప్రయత్నాలను మోదీ చేయడం మారుతున్న పరిస్థితులకు నిదర్శనం. బీజేపీకి వారి అండదండలు అవసరం లేదని పార్టీ అధ్యక్షుడు జగత్‌ప్రకాశ్ నడ్డా గత ఏడాది అన్నప్పుడున్న పరిస్థితులు వేరు. ఇప్పుడున్న పరిస్థితులకూ తేడా కనిపిస్తోంది. అందుకే అనివార్యంగా ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న రాధాకృష్ణన్ను ఎంపిక చేయక తప్పలేదు. ఓ రకంగా చెప్పాలంటే మోడీ నిరంకుశ విధానాలను గమనిస్తూ వచ్చిన ఆర్ఎస్ఎస్ మెల్లగా రంగంలోకి దిగిందన్న ప్రచారం కూడా ఉంది. రేపటి బిజెపి అధ్యక్ష ఎన్నికల్లో కూడా ఆర్ఎస్ఎస్ ప్రధాన భూమిక పోషిస్తుందనడంలో సందేహం లేదు. ఇకపోతే రాధాకృష్ణన్ కూడా సామాన్య వ్యక్తి కాదు. ఆయన తన 16 సంవత్సరాల వయసులో ఆర్ఎస్ఎస్‌కు అంకితమయ్యారు. 'సంఘ్' తిరుప్పూర్ టౌన్ సంఘ చాలక్‌గా తర్వాత జిల్లా సంఘ్ చాలక్‌గా పనిచేసిన తర్వాత 1974లో ఎమర్జెన్సీకి ముందు జనసంఘ్‌లో చేరారు. 1980లో భారతీయ జనతా పార్టీ ఏర్పడ్డప్పుడు రాధాకృష్ణన్ అటల్ బిహారీ వాజపేయికి సహాయకుడుగా ఉన్నారు. బీజేపీ భావజాలానికి ఆయన నిబద్ధత తిరుగులేనిది. తమిళనాడులో 19 వేల కిలోమీటర్ల పాటు- యాత్ర చేసి తమిళనాడులో బీజేపీ అంటే రాధాకృష్ణన్ అననట్లుగా పార్టీకోసం కృషి చేశారు. 1998లో రాధాకృష్ణన్ పోటీ- చేసిన కోయంబత్తూర్ నియోజకవర్గంలో ప్రచారం చేసేందుకు బీజేపీ నేత లాల్ కృష్ణ ఆడ్వాణీ వచ్చినప్పుడే ఆయన పాల్గొనాల్సిన ఎన్నికల సభలోనూ, ఇతర ప్రాంతాల్లోనూ బాంబులు పేలి 85 మంది మరణించారు. ఒక పత్రికా విలేఖరికి ఇంటర్వ్యూ ఇవ్వడం వల్ల ఆడ్వాణీ కోయంబత్తూర్‌కు ఆలస్యంగా వచ్చారు. ఆయనకుస్వాగతం పలికేందుకు రాధాకృష్ణన్ విమానాశ్రయానికి రావడంతో కోయంబత్తూరుకు వెళ్లలేదు. వారిద్దరూ సకాలంలో సభకు చేరుకుని ఉంటే పరిస్థితి ఎలా ఉండేదో బాంబు పేలుళ్లను బట్టి అర్థంచేసుకోవచ్చు. సంఘ్‌ను రాధాకృష్ణన్ కోయంబత్తూర్‌లో బలోపేతం చేసినందుకే తీవ్రవాదులు ఆ ప్రాంతాన్ని ఎంచుకున్నారనేది స్పష్టమయింది. ఆ ఎన్నికల్లో కోయంబత్తూర్‌లో హిందూ ఓటర్లు సంఘటిత మై రాధాకృష్ణన్ అఖండ మెజారిటీతో గెలిచారు. ఈ క్రమంలో పరిణామాలను గమనిస్తే రాధాకృష్ణన్‌ను ఎంపిక చేయడంలో ఆర్ఎస్ఎస్ ముందున్నదన్నది స్పష్టం అయ్యింది. అందుకేనేమో మోడీ ఇటీవల తరచూ మోహన్ భగవత్ బాటలో నడుస్తున్నారు. నాగపూర్ ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం సందర్శించారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఎర్రకోటలో మోదీ తన ప్రసంగంలో ఆర్ఎస్ఎస్‌ను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇదంతా కూడా ఆర్ఎస్ఎస్‌ను కాదని ఏమీ చేయలేరన్న సంకేతాలు బలంగా వస్తున్నాయి. అందుకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుల ఎంపికలో కూడా ఆర్ఎస్ఎస్ భావజాలం పనిచేసింది. రేపటి పార్టీ అధ్యక్ష ఎన్నికపైనా ఈ ప్రభావం ఉంటుంది.

## ఆన్‌లైన్ గేమింగ్ నిషేధం తగదు

### అవసరమైతే నియంత్రణ విధించండి -అమిత్ షాకు ఆల్ ఇండియా గేమింగ్ ఫెడరేషన్ వినతి

**న్యూఢిల్లీ,ఆగస్టు 20,ఆంధ్ర ప్రగతి**

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ఆగడాలు ఇటీవల మరీ పెరిగిపోయాయి. దీన్ని అరికట్టడంలో భాగంగా 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'ను తీసుకొచ్చేందుకు కేంద్రం సిద్ధమైంది. ఈ బిల్లుకు కేబినేట్ తాజాగా ఆమోదం తెలిపింది. అయితే ఈ బిల్లుపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. ఆల్ ఇండియా గేమింగ్ ఫెడరేషన్ కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు లేఖ రాసింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లను అరికట్టేందుకు కేంద్రం తీసుకొచ్చే బిల్లు కారణంగా తమ రంగానికి తీవ్ర నష్టం కలుగుతుందని ఏఐజీఎఫ్ ఆందోళన వ్యక్తంచేసింది. ఇది అమల్లోకి వస్తే తమ పరిశ్రమకు భారీ నష్టం జరుగుతుందని, కోట్లమంది చట్టబద్ధమైన గేమర్‌లు అక్రమంగా నెట్‌వర్క్‌లను నడిపేవారి వైపు వెళ్లేలా చేస్తుందని ఆవేదన వ్యక్తంచేసింది. అంతేకాక.. ఈ రంగంలోని



అనేకమంది ఉద్యోగులపై కూడా దీని ప్రభావం ఉంటుందని హెచ్చరించింది. ఈసందర్భం గా దీన్ని పూర్తిగా నిషేధం విధించేకంటే.. దానిపై నియంత్రణ చర్యలు తీసుకోవాలని కేంద్రానికి సూచించింది. ఆటగాళ్లను రక్షించడంతో పాటు- వారు బాధ్యతాయుతంగా ఆడేలా చర్యలు తీసుకోవాలని కోరింది. కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించాలని, పరిశ్రమను పూర్తిగా చీకట్లోకి నెట్టేయొద్దని అభ్యర్థించింది. ఈ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ వాడకం ఇటీ-వల విపరీతంగా పెరిగిపోయింది. దీనికి బానిసైన కొందరు అప్పుల ఊబిలో కూరుకుపోయి ప్రాణాల మీదకు తెచ్చుకుంటు-న్నారు. వీటిని ప్రమోట్ చేసిన ప్రముఖులు ప్రస్తుతం దర్యాప్తు సంస్థల నుంచి విచారణ ఎదుర్కొంటున్నారు. ఈక్రమంలోనే ఆన్‌లైన్ బెట్టింగ్‌ను నేరంగా పరిగణిస్తూ.. 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'ను తీసుకువచ్చేందుకు కేంద్రం సిద్ధమైంది. మంగళవారం ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో దీనికి ఆమోదం లభించిందని అధికార వర్గాలు తెలిపాయి. దీన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. దీంతో ఇక ఆన్‌లైన్ జూదానికి తెరపడనుంది.

## అగ్ని-5 బాలిస్టిక్ మిస్సైల్ ను విజయవంతంగా పరీక్షించిన భారత్

### రక్షణ రంగంలో భారత్ మరో కీలక ముందడుగు

భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) మరో కీలక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. దేశీయంగా అభివృద్ధి చేసిన అణ్వస్త్ర సామర్థ్యం గల అగ్ని-5 బాలిస్టిక్ క్షిపణిని బుధవారం విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి సాయంత్రం 7:30 గంటల సమయంలో ఈ ప్రయోగాన్ని నిర్వహించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ క్షిపణి నిర్దేశిత లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో ఛేదించి తన సత్తాను చాటింది.




సుమారు 5,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను కూడా ఛేదించగల సామర్థ్యం అగ్ని-5 సొంతం. ఈ ప్రయోగ సమయంలో క్షిపణి పనితీరు, వేగం, ట్రాకింగ్ వ్యవస్థలు వంటి అన్ని సాంకేతిక అంశాలను శాస్త్రవేత్తలు క్షుణ్ణంగా పర్యవేక్షించారు. అనుకున్న విధంగానే క్షిపణి అన్ని ప్రమాణాలను విజయవంతంగా అందుకుందని అధికారులు ధ్రువీకరించారు. డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలు, సైనిక ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఈ పరీక్ష సజావుగా సాగింది.భారత రక్షణ వ్యవస్థలో అగ్ని-5 క్షిపణి అత్యంత కీలకమైనదిగా పరిగణిస్తారు. ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి అయిన ఇది, అణ్వాయుధాలను మోసుకెళ్లే సామర్థ్యంతో దేశ రక్షణ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుంది. ఈ విజయవంతమైన పరీక్షతో రక్షణ సాంకేతికతలో స్వావలంబన దిశగా భారత్ మరో బలమైన అడుగు వేసినట్లయిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తాజా విజయంపై డీఆర్‌డీఓ శాస్త్రవేత్తల బృందాన్ని పలువురు ఉన్నతాధికారులు అభినందించారు.

## నేరస్థులు రాజకీయ ముసుగు వేసుకున్నారు.. వైసీపీపై మంత్రి నిమ్మల ఫైర్

**సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపాటు**

**కూటమి పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారం**

**ప్రతిపక్ష హెూదా రానీ ఏకైక పార్టీ వైసీపీ మాత్రమేనని ఎద్దేవా**





ఆంధ్రప్రదేశ్ లో కూటమి పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ తప్పుడు ప్రచారానికి దిగిందని మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపించారు. సోషల్ మీడియాలో వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజల్లో భయాందోళనలు సృష్టించడమే లక్ష్యంగా అమరావతి కొట్టుకుపోతుందని, బెజవాడ మునిగిపోతుందని పోస్టులు పెట్టి వైరల్ చేస్తున్నారని విమర్శించారు. రాయలసీమలో రిజర్వాయర్లు కళకళలాడుతున్నాయని, చంద్రబాబు సారథ్యంలో వాటర్ మేనేజ్మెంట్, ఫ్లడ్ మేనేజ్మెంట్ తో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నామని చెప్పారు.

రాష్ట్రంలో అభివృద్ధి పనులు కొనసాగితే తమ ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందనే భయాందోళనలతో వైసీపీ నేతలు ఇలా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. నేరస్థులు రాజకీయ ముసుగు ధరించి పార్టీని నడుపుతున్నారని మంత్రి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష హెూదా కూడా రాని ఏకైక పార్టీ వైసీపీ మాత్రమేనని ఎద్దేవా చేశారు. భారతీయులంతా పండుగలా జరుపుకునే ఆగస్టు 15 వేడుక రోజు జాతీయ జెండాను కూడా ఎగరవేయకుండా మాజీ ముఖ్యమంత్రి జగన్ వింత పోకడలకు తెరలేపారని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు.

# ఆసియా కప్‌పై అనుమానాలొద్దు

## కేంద్రం ఆదేశాల మేరకే బిసిసిఐ వెళుతుంది

### క్రికెటర్ సునీల్ గవాస్కర్



**ముంబై,ఆగస్ట్20:** ఆసియా కప్ కోసం టీమ్ఇండియా తన స్క్వాడ్‌ను ప్రకటించింది. పాకిస్థాన్ కూడా ఇప్పటికే జట్టును వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే, భారత్ - పాక్ మ్యాచ్ జరుగుతుందా లేదా అనేది ఇప్పటికీ అభిమానులకు అనుమానంగానే ఉంది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్‌తో క్రికెట్ సంబంధాలనూ తెంచుకోవాలనే డిమాండ్లూ వచ్చాయి. వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ లీగ్‌లో పాక్‌తో భారత ఛాంపియన్స్ ఆడలేదు. ఇప్పుడు ఆసియా కప్‌లో ఏ నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. అయితే ఇందులో ఏ సంశయం వద్దని.. కేంద్ర ప్రభుత్వం ఏం చెబితే దానిని బీసీసీఐ, టీమ్ఇండియా ఫాలో అవుతుందని క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ సూచించాడు. ఇలాంటప్పుడు ప్లేయర్లపై ఎవరూ విమర్శలు చేయొద్దని వ్యాఖ్యానించాడు. పాకిస్థాన్‌తో మ్యాచ్‌పై భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే.. దానిని అందరూ అనుసరించాలి. ఇందులో ఆటగాళ్లను విమర్శించకూడదు. బీసీసీఐ మాత్రం ప్రభుత్వం ఆదేశాలను పాటిస్తుంది. కాబట్టి, ఇదంతా కేంద్రంపై ఆధారపడి ఉంది. భారత ప్రభుత్వం నిర్ణయం మేరకే బీసీసీఐ ముందుకు వెళ్లాల్సిఉంటుందని గావస్కర్ స్పష్టంచేశాడు. ఆసియా కప్ కోసం ప్రకటించిన జట్టు- చాలా బాగుంది. లోతైన బ్యాటింగ్‌ను చూస్తే కుడి - ఎడమ కాంబినేషన్‌తో వైవిధ్యంగా ఉంది. ఇక సమతూకంతో ఎంపిక చేసిన బౌలింగ్ యూనిట్ కూడా సూపర్. ఇక శుభ్‌మన్ గిల్‌కు వైస్ కెప్టెన్ ఇవ్వడం మంచి నిర్ణయం. ఇప్పుడు ఉప సారథిగా నియమించడం వెనక పెద్ద ప్రణాళికే ఉంది. భవిష్యత్తులో టీ-20 సారథిగా ఎంపిక చేసే అవకాశం లేకపోలేదని గావస్కర్ వ్యాఖ్యానించాడు.

# ఆసియా కప్ ఎంపిక



## శ్రేయస్కు చోటు దక్కపోవడం అన్యాయం

### మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప

**ముంబై,ఆగస్ట్20:** యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి టీ-20 ఫార్మాట్లో ఆసియా కప్ జరగనుంది. దీనికి సంబంధించి బీసీసీఐ 15 మంది సభ్యులతో కూడిన భారత జట్టు-ను మంగళవారం ప్రకటించింది. ఈ నేపథ్యంలో స్క్వాడ్‌లో శ్రేయస్ అయ్యర్‌కు చోటు- కల్పించకపోవడం తనను ఆశ్చర్యానికి గురి చేసిందని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప అన్నాడు. అయితే 2026లో జరగనున్న టీ-20 వరల్డ్‌కప్‌లో మాత్రం శ్రేయస్‌ను కచ్చితంగా ఆడించాలని సూచించాడు. టీ-20 వరల్డ్ కప్ కంటే ముందు భారత్ 18 టీ-20 మ్యాచ్‌లు ఆడనుంది. టీ-మ్ఇండియా ఛాంపియన్స్ ట్రోఫీ గెలవడంలో కీలకపాత్ర వహించిన శ్రేయస్ అయ్యర్‌కు చోటు దక్కకపోవడం ఆశ్చర్యానికి గురిచేసింది. కానీ అతడు త్వరలోనే జట్టులో స్థానం సొంతం చేసుకుంటాడు. ఎందుకంటే అతడికి ఆ అర్హత ఉంది. శ్రేయస్ కచ్చితంగా వరల్డ్ కప్ ఆడే జట్టు-లో ఉండాలని రాబిన్ ఉతప్ప పేర్కొన్నాడు. అయితే శ్రేయస్ అయ్యర్‌కు జట్టులో స్థానం దక్కకపోవడంపై బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ మాట్లాడాడు. 'దీనిలో శ్రేయస్ తప్పు కానీ.. మా తప్పు కానీ లేదు. ఎందుకంటే మేం కేవలం 15 మందిని మాత్రమే ఎంపిక చేయగలం. అతడు తన అవకాశం కోసం ఎదురుచూడక తప్పదు' అని అన్నాడు. అలాగే అభిషేక్ శర్మ ఆల్‌రౌండర్ నైపుణ్యం వల్ల యశస్వి జైస్వాల్‌ను కాదని అతణ్ని ఎంపిక చేశామని అగార్కర్ వివరించాడు. 2026లో జరగనున్న టీ-20 వరల్డ్ కప్ కంటే ముందు టీ-మ్ఇండియా.. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికాతో పొట్టిఫార్మాట్లో మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. శ్రేయస్ అయ్యర్ చివరిసారిగా టీ-మ్ఇండియా తరఫున డిసెంబర్ 2023లో ఆస్ట్రేలియాపై జరిగిన టీ-20 మ్యాచ్‌లో తలపడ్డాడు. ఆ మ్యాచ్‌లో అతడు హాఫ్ సెంచరీతో రాణించాడు. అప్పటి నుంచి అతడు టీ-20 జట్టు-కు ఎంపికవడం లేదు. దేశవాళీల్లో నిలకడగా రాణిస్తున్నప్పటికీ అతడికి అవకాశాలు రావడం లేదు.

# వైస్ కెప్టెన్‌గా శుభమన్‌గిల్



## సంజూ శాంసన్ భవిష్యత్‌పై ప్రభావం

**ముంబై,ఆగస్ట్20:** టీ-20 ప్రపంచ కప్ సంగ్రామానికి మరో ఆరు నెలలే సమయం. ఆలోగా ఆసియా కప్ బరిలో టీ-మ్ఇండియా జట్టు- ప్రకటన జరిగిపోయింది. కెప్టెన్ సూర్యకు డిప్యూటీగా శుభ్‌మన్ గిల్ వచ్చాడు. ఇప్పుడందరి మదిలో ఓ ప్రశ్న మొదలైంది. వైస్ కెప్టెన్‌గా గిల్ రాక.. సంజుశాంసన్ భవిష్యత్తుకు ఏమైనా సమస్యగా మారనుందా పంత్ లేని లోటు-ను సంజు పూరిస్తాడా ఇటీవలే టెస్టు జట్టు సారథిగా ఎంపికైన శుభ్‌మన్ గిల్ మొదటి సిరీస్‌లోనే అదరగొట్టాడు. అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఇప్పుడు పొట్టి ఫార్మాట్‌లోనూ అక్షర్ పటేల్‌ను కాదని గిల్‌కే వైస్ కెప్టెన్సీ అప్పగిస్తూ బీసీసీఐ సెలక్షన్ కమిటీ- నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే టెస్టు సారథిగా ఉన్న గిల్.. రాబోయే కాలంలో టీ-20, వన్డేలకూ నాయకత్వం వహించనున్నాడని క్రికెట్ వర్గాలు తెలిపాయి. వన్డే ప్రపంచకప్ 2027తోపాటు- లాస్ ఏంజెలెస్ వేదికగా 2028 ఒలింపిక్స్ బరిలోకి దిగే జట్టును నడిపించే అవకాశం ఉంది. ఇప్పుడిది ఓపెనర్, సీనియర్ ఆటగాడు సంజుశాంసన్‌కు కొత్త తలనొప్పి తీసుకొచ్చే అవకాశం లేకపోలేదు. ఆసియా కప్‌లో రాణించడంతోపాటు- ఇతర సమీకరణాలు కలిసి వస్తేనే 'వరల్డ్' కప్ జట్టులోనూ చోటు- దక్కేది. ఆసియా కప్ కోసం యశస్వి జైస్వాల్‌ను కాదని మరీ అభిషేక్ శర్మకు జోడీగా సంజును మేనేజ్‌మెంట్ తీసుకుంది. వికెట్ కీపర్ జాబితాలో ముందుంటాడు. రిషభ్ పంత్ గాయం కారణంగా టోర్నీకి అందుబాటు-లో లేకపోవడం సంజుకు కలిసొచ్చింది. కానీ, పొట్టికప్‌లో మాత్రం కచ్చితంగా అతడి నుంచి తీవ్ర పోటీ- తప్పదు. పంత్ దూకుడు మనందరికీ తెలిసిందే. ఇప్పటివరకు పొట్టి ఫార్మాట్‌లో పెద్దగా రాణించకపోయినప్పటికీ.. టీ-20 ప్రపంచకప్‌లో మాత్రం తొలుత ప్రాధాన్యం ఇచ్చేది పంత్‌కే. ఎడమ చేతివాటంతోపాటు- గత పొట్టికప్‌లో వన్‌డౌన్‌లో కొన్ని విలువైన ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఇప్పుడు ఆసియాకప్‌లో గిల్ వన్‌డౌన్‌లో ఆడినా.. 2026 టీ-20 కప్‌లో మాత్రం ఓపెనర్‌గానే బరిలోకి దిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అప్పుడు పంత్ మళ్లీ తన వన్‌డౌన్‌కే వస్తాడు. అయితే, ఇలాంటి క్లిష్ట సమయాల్లోనూ సంజుకు మరొక అవకాశం లేకపోలేదు. టీ-20ల్లో అద్భుతమైన రికార్డు ఉన్న సంజుశాంసన్ కొన్నాళ్లపాటు- ఫామ్ లేక ఇబ్బందిపడ్డాడు. గతేడాది చివరి నుంచి వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం ఇప్పుడు కలిసొచ్చింది. పొట్టి ఫార్మాట్‌లో వరుసగా రెండు సెంచరీలు బాదిన భారత క్రికెటర్‌గానూ రికార్డు సృష్టించాడు. ఇప్పుడు ఆసియా కప్‌లోనూ ఓపెనర్‌గా రాణిస్తే.. అతడిని పక్కనపెట్టడం మేనేజ్‌మెంట్‌కు సాధ్యపడదు. ఆసియా కప్‌తో పాటు- ఆరు నెలల వ్యవధిలో జరగబోయే టీ-20 సిరీసుల్లో ఏమాత్రం ప్రదర్శన సరిగా లేకపోయినా సంజు భవిష్యత్తు మరోసారి ప్రమాదంలో పడిపోవడం ఖాయం.

# యశస్వి జైలస్వాల్‌కు చోటు దక్కక పోవడం ఆశ్చర్యకరం

## •టీమిండియా స్పిన్నర్ అశ్విని రవిచంద్రన్



**ముంబై,ఆగస్ట్20:** ఆసియా కప్ 2025 కోసం భారత టీ-20 జట్టు-ను ప్రకటించిన తర్వాత, సెలక్షన్ కమిటీ- నిర్ణయాలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా, యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను జట్టులోకి ఎంపిక చేయకపోవడం టీమిండియా సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌కు ఆశ్చర్యకరంగా ఉందని.. నిరాశ కలిగించిందని పేర్కొన్నాడు. జైస్వాల్‌ను ఇలా పక్కన పెట్టడం అన్యాయంగా అభిప్రాయపడ్డాడు. అద్భుతంగా ప్రదర్శిస్తున్న ఆటగాడికి ఇలాంటి అన్యాయం జరిగితే ఆటతీరును దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆయన తెలిపాడు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ- శుభ్‌మన్ గిల్‌ను వైస్ కెప్టెన్‌గా తీసుకుని జట్టు-లోకి తీసుకోగా.. జైస్వాల్‌ను జట్టు- నుంచి తప్పించింది. ఈ నిర్ణయం పై అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో స్పందించారు. 'జట్టు- కోసం నిస్వార్థంగా ఆడే యువ ఆటగాడు జైస్వాల్. ఇలా తప్పించబడడం చాలా బాధాకరం. అతను తన వ్యక్తిగత రికార్డులను కంటే జట్టు-ను ముందుపెట్టే ఆటగాడు. ఇలాంటి నిర్ణయం వల్ల అతను జట్టు-కు కాకుండా.. తన వ్యక్తిగత విజయాల కోసం ఆడే పరిస్థితి వచ్చే ప్రమాదం ఉంది' అంటూ ఆందోళన వ్యక్తం చేశాడు. జైస్వాల్ ప్రదర్శనను గురించి మాట్లాడే సమయంలో -టె-స్టు క్రికెట్‌లో అవకాశం ఇచ్చిన వెంటనే తన ప్రతిభను అందిపుచ్చుకున్నాడు. ఇటీ-వల భారత -టె-స్ట్ బ్యాటర్లలో అతను అత్యంత విజయవంతంగా నిలిచాడు. ఏ ఫార్మాట్‌లో అవకాశం ఇచ్చినా, అతను జట్టు-కు అత్యుత్తమంగా రాణించాడు. ఇంత మంచి ఆటగాడికి జట్టు-లో చోటు- ఇవ్వకపోవడం అర్థం కావడం లేదని అశ్విన్ పేర్కొన్నారు. టీ-20 ఫార్మాట్‌లో జైస్వాల్ 165 స్ట్రయిక్ రేట్‌తో ఆడుతున్నాడని, ఎప్పటికప్పుడు జట్టు-కు ప్రాధాన్యత ఇస్తున్నాడని అశ్విన్ చెప్పాడు. జైస్వాల్ వంటి ఆటగాళ్లు దొరకడం చాలా కష్టమైన విషయం. బంతిని బాదాల్సినప్పుడే కాదు.. కష్టం వచ్చినప్పుడు కూడా శక్తితో ఆడేందుకు ప్రయత్నిస్తాడని.. అలాంటి ఆటగాళ్లను ప్రోత్సహించడం కంటే, ఇలా పక్కన పెట్టడం అసంబద్ధమని అశ్విన్ పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల జైస్వాల్ మళ్లీ తన కెరీర్‌ను మొదటి నుంచి పునరుద్ధరించుకోవాల్సి వచ్చే పరిస్థితి వచ్చిందని అశ్విన్ చెప్పుకొచ్చాడు. గిల్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించడం ప్రస్తుత టోర్నీ కోసమే కాకుండా.. భవిష్యత్ కెప్టెన్సీని దృష్టిలో పెట్టు-కొని తీసుకున్న నిర్ణయంగా అశ్విన్ చెప్పుకొచ్చాడు. సెలక్టర్లు శుభ్‌మాన్ గిల్‌ను భవిష్యత్ కెప్టెన్‌గా పరిగణించే అవకాశం ఉందని.. బహుశా అన్ని ఫార్మాట్‌లకు కెప్టెన్‌గా కనిపించొచ్చని.. అయితే, ప్రతి ఫార్మాట్‌లో ఒకే ఒక కెప్టెన్ ఉండాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఈ నిర్ణయం వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ సంజు సామ్సన్‌పై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుందని అశ్విన్ తెలిపాడు. అత్యంత విచారకరమైన విషయం ఏమిటంటే గిల్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించిన వెంటనే, సామ్సన్ స్థానానికి ముప్పు ఏర్పడిందని.. దీని అర్థం సంజు సామ్సన్ ఆడకపోవచ్చని.. శుభ్‌మాన్ గిల్ ఖచ్చితంగా ఆడుతాడని, ఓపెనర్‌గా వస్తాడని పేర్కొన్నారు. శామ్సన్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడని.. గతేడాది టీ-20ల్లో మూడు సెంచరీలు చేశాడని గుర్తు చేశాడు.

# రోహిత్, కోహ్లీలకు షాక్.. వన్డే ర్యాంకింగ్స్‌లో ఇద్దరి పేర్లు మాయం..



టి-20, టెస్ట్ ఫార్మాట్‌లకు రిటైర్‌మెంట్ ప్రకటించిన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్న విషయం తెలిసిందే. 2027లో జరిగే వన్డే ప్రపంచకప్‌లో పాల్గొనాలని వీరిద్దరు భావిస్తున్నారు. అభిమానులు కూడా ఇదే కోరుకుంటున్నారు. అయితే మరోవైపు రోహిత్, కోహ్లీలు త్వరలోనే వన్డేలకు కూడా గుడ్‌బై చెప్పొస్తారనే మాట కూడా వినిపిస్తోంది. అయితే తాజాగా ఐసిసి రో-కోలకు షాక్ ఇచ్చింది. తాజాగా ప్రకటించిన వన్డే ర్యాంకుల్లో (ICC ODI Rankings) వీరిద్దరి పేరు కనిపించలేదు. ఆగస్టు 13న ప్రకటించిన ఐసిసి ర్యాంకుల్లో రోహిత్ 2వ స్థానంలో, కోహ్లీ 4వ స్థానంలో ఉండగా.. ఈ వారం ప్రకటించన లిస్ట్‌లో వీరిద్దరి పేరు మాయం అయింది.మొదటి స్థానంలో శుభ్‌మాన్ గిల్ అలాగే కొనసాగుతుండగా.. రెండో స్థానంలో పాకిస్థాన్ ఆటగాడు బాబర్ ఆజామ్ నిలిచాడు. అయితే దీని వెనుకగల కారణాలు స్పష్టంగా తెలియడం లేదు. సాధారణంగా ఓ ఫార్మాట్‌లో 9-12 నెలల కాలం పాటు ఒక మ్యాచ్ కూడా ఆడకపోతే.. ఆ ఆటగాడి పేరును ర్యాంకింగ్స్ (ICC ODI Rankings) నుంచి తొలగిస్తారు. కానీ, రోహిత్, కోహ్లీలు ఐదు నెలల క్రితం జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో పాల్గొన్నారు. దీంతో ఈ కారణం చేత వీరి పేరును తొలగించే అవకాశం లేదు. అయితే దీని వెనుక ఏదైనా కుట్ర ఉందా అని అభిమానులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రోహిత్, కోహ్లీలను వన్డేల నుంచి కూడా దూరం చేయాలని బిసిసిఐ.. ఐసిసికి ఏదైనా లేఖ రాసిందా అని అనుకుంటున్నారు. కానీ, ఏదో సాంకేతిక లోపం వల్లే ఇలా జరిగి ఉంటుందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక టాప్-10లో భారత్ తరఫున శుభ్‌మాన్ గిల్ కాకుండా కేవలం శ్రేయస్ అయ్యర్‌కి మాత్రమే చోటు దక్కింది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# హరిహరవీరమల్లు ఓటిటిలో క్లైమాక్స్‌లో కట్స్




పవన్ కల్యాణ్ తొలి పాన్ ఇండియా సినిమా 'హరి హర వీరమల్లు' ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. అయితే, ఈ సినిమా థియేటర్ వెర్షన్‌లో కొన్ని మార్పులు చేసి ఓటీటీలోకి అందుబాటులోకి తెచ్చారు. థియేటర్‌లో ఈ సినిమా విడుదలైనప్పుడు ఇందులోని కొన్ని సన్నివేశాలపై విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. కొన్ని సీన్స్‌లోని వీఎఫ్ఎక్స్ విషయంలో మరింత శ్రద్ధ వహించాల్సిందని కామెంట్స్ వినిపించాయి. ఇప్పుడు ఆ సన్నివేశాలను ఓటీటీ-వెర్షన్‌లో తొలగించినట్లు- సమాచారం. ముఖ్యంగా గుర్రపు స్వారీ సన్నివేశం, పవన్ కల్యాణ్ బాణం గురిపెట్టే సీన్స్‌ను థియేటర్లో విడుదలైన తర్వాత మార్పులు చేశారు. అయితే ఓటీటీలో ఈ సన్నివేశాలను పూర్తిగా కట్ చేశారని నెటిజన్లు పేర్కొంటున్నారు. క్లైమాక్స్‌లోనూ కొన్ని మార్పులు చేసినట్లు- తెలుస్తోంది. అసుర హననం పాట తర్వాత పార్ట్2 ప్రకటనతో సినిమాను పూర్తి చేశారట. -క్లైమాక్స్‌లో వచ్చే బాబీదేవోల్ సంభాషణలు, కొన్ని యాక్షన్ సన్నివేశాలను కూడా తొలగించారట. మొత్తం మీద చిత్రబృందం దాదాపు 15 నిమిషాల ఫుటేజ్‌ను కట్ చేసి ఓటీటీలో విడుదల చేసినట్లు- తెలుస్తోంది. జులై 24న పాన్ ఇండియా స్థాయిలో విడుదలైన ఈ మూవీ వన్‌మ్యాన్ షోగా పవన్ అభిమానులను ఆకట్టుకుంది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ మూవీని రెండు భాగాలుగా తెరకెక్కించారు.

# పరదా విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది




సోషల్ మీడియాలో వచ్చే కామెంట్స్‌ను పట్టించుకోవడం మానేసినట్లు నటి అనుపమ పరమేశ్వరన్ కుండబద్దలు కొట్టారు. సోషల్ మీడియాలో వచ్చే కామెంట్స్‌ను పట్టించుకోను. నేను పరదా పోస్టర్స్ షేర్ చేసినప్పుడు కూడా కొందరు దీనికి నెగెటివ్ కామెంట్స్ పెట్టారు. 'అట్టర్ ఫ్లాప్ అవుతుంది' అన్నారు. ఆ వ్యాఖ్యలు మా సినిమాను నిర్ణయించలేవు. ఒకవేళ నిజంగానే ఇది ప్రేక్షకాదరణ పొందలేకపోయినా.. నేను ఒక మంచి సినిమా తీశాననే సంతృప్తి నాకు జీవితమంతా ఉంటుంది. ఆమె ప్రధాన పాత్రలో ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించిన 'పరదా' ఆగస్టు 22న విడుదలకు సిద్ధమైంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను ఆమె పంచుకున్నారు.

కెరీర్ ప్రారంభించిన తొలినాళ్లలో ఇలాంటి కామెంట్స్ విని బాధ పడేదాన్ని. అనుభవం వచ్చే కొద్దీ ఇవి చాలా చిన్న విషయాలుగా కనిపిస్తాయి. గతంలో ప్రతి పోస్ట్‌కు వచ్చిన కామెంట్స్ అన్నీ చదివేదాన్ని. ఇప్పుడు నేను చెప్పాలనుకున్న విషయం చెప్పేసి వదిలేస్తున్నా. ఎవరెన్ని మాటలన్నా మనం జీవితంలో ముందుకు వెళ్లాల్సిందే అని అర్థం చేసుకున్నప్పుడు ఇవి చాలా చిన్న విషయాలుగా కనిపిస్తాయన్నారు. టిల్లు స్క్వేర్ తర్వాత నేను మాట్లాడే విధానంలోనూ మార్పు వచ్చింది. ఆ సినిమా విడుదలకు ముందు నాపై చాలా నెగెటివిటీ- వచ్చింది. రిలీజ్ అయ్యాక ప్రశంసలు వచ్చాయి. -ట్రైలర్ విడుదలయ్యాక నెగెటివిటీ- వస్తుందని తెలిసే ఆ పాత్రను ఎంపిక చేసుకున్నాను. అలాంటి రోల్స్‌ను అంగీకరించడమే ఒక సవాలు. వాటిని ఓకే చేయాలంటే ధైర్యం కావాలి. ఆ సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూల్లో ఎన్నో ఇబ్బందికర మైన ప్రశ్నలు అడిగారు. అలాంటి ప్రశ్నలు కేవలం మహిళలనే అడుగుతారు. హీరోలను ఎందుకు అడగరు?. వాళ్లకు వ్యూస్ రావడం కోసమే అలా ఇబ్బందికరమైన ప్రశ్నలు అడుగుతారు. వాటికి సమాధానాలు చెప్పలేకపోయానని తెలిపారు.



# మంచి లవ్ స్టోరీ కోసం మోక్షజ్ఞ చూపు

## బాలయ్య వారసుడి ఎంట్రీపై నారా రోహిత్



నందమూరి అభిమానులతో పాటు- సినీ ప్రియులంతా బాల్య నటవారసుడు మోక్షజ్ఞ ఎంట్రీ కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా మోక్షజ్ఞ లుక్ కూడా ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై నటుడు నారా రోహిత్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ఇండస్ట్రీకి వచ్చేందుకు ఈ నందమూరి వారసుడు చాలా ఆసక్తిగా ఉన్నాడని తెలిపారు. ఇటీవల మోక్షజ్ఞతో మాట్లాడినప్పుడు కూడా స్క్రిప్ట్ కోసం చూస్తున్నట్లు- చెప్పాడు. ఈ ఏడాది చివర్లో, లేదంటే వచ్చే సంవత్సరం ప్రారంభంలో అతని ఎంట్రీ ఉండే అవకాశం ఉంది. ఇండస్ట్రీకి రావడం కోసం అతడు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాడు. సినిమాల కోసమే లుక్ మార్చుకున్నాడు. గతంలో లుక్ కంటే ఇప్పుడు చాలా మార్పు వచ్చింది. ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ కోసం వెతుకుతున్నట్లు- ఈ మధ్య కలిసినప్పుడు చెప్పాడు. అలాంటి కథ ఉంటే ఈ ఏడాదిలోనే ఎంట్రీ- ఉండే అవకాశం ఉందని నారా రోహిత్ తెలిపారు. బాలకృష్ణతో తన మల్టీ స్టారర్‌పై నారా రోహిత్ స్పందించారు. గతంలో స్క్రిప్ట్ రెడీ చేసినట్లు- చెప్పారు. కథ రెడీ చేశారు. మా ఇద్దరికీ లుక్ టెస్ట్ కూడా చేశారు. కథ నచ్చింది. కానీ, ఆ సమయంలో ఆయనకు వరుస సినిమాలు, ఎలక్షన్స్ ఉండడంతో అది పట్టాలెక్కలేదు. బాలయ్య నటించిన మరో సినిమాలోనూ నేను అతిథి పాత్రలో చేయాల్సిఉంది. కానీ, అది కూడా కొన్ని కారణాల వల్ల కుదర్లేదు. ఆ సినిమా స్థానంలోనే ఆయన 'లెజెండ్' చేశారు. భవిష్యత్తులో బాలయ్యతో కలిసి నటించే అవకాశం వస్తే కచ్చితంగా చేస్తాను. ఆ రోజు కోసమే ఎదురుచూస్తున్నా అని నారా రోహిత్ చెప్పారు. ప్రస్తుతం నారా రోహిత్ నటించిన 'సుందరకాండ' విడుదలకు సిద్ధంగా ఉంది. ఆయన కథానాయకుడిగా కొత్త దర్శకుడు వెంకటేశ్ నిమ్మలపూడి తెరకెక్కించిన చిత్రమిది. శ్రీదేవి విజయ్‌కుమార్, వృతి వాఘని కథానాయికలు. ఈనెల 27న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.

# ఫౌజీ నుంచి ప్రభాస్ లుక్ లీక్

## అలాంటివి షేర్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరిక



హను రాఘవపూడి, ప్రభాస్ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కుతోన్న 'ఫౌజీ' సినిమా నుంచి ప్రభాస్ లుక్ లీకైంది. అందులో ఈ హీరో వింటేజ్ లుక్‌లో కనిపించడంతో అది క్షణాల్లో వైరలైంది. నెటిజన్లు దాన్ని తెగ షేర్ చేశారు. తాజాగా దీనిపై నిర్మాణ సంస్థ స్పందించింది. కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ఈ సినిమా కోసం ఎంతోమంది ఎదురుచూస్తున్నారని మాకు తెలుసు. చిత్రీకరణ సమయంలో సెట్స్ నుంచి ఓ ఫొటో బయటకు వచ్చిన విషయం మా దృష్టికి వచ్చింది. మీకు అద్భుతమైన సినిమాటిక్ అనుభవాన్ని ఇచ్చేందుకు మేం నిరంతరం కృషి చేస్తున్నాం. ఇలాంటి లీక్‌లు మా టీమ్ నైతికతను దెబ్బతీస్తాయి. అనధికారికంగా ఎవరైనా ఈ సినిమా ఫొటోలు షేర్ చేస్తే వారి ఖాతాలను తొలగించడమే కాకుండా సైబర్ నేరంగా పరిగణిస్తాం. వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం అని నిర్మాణ సంస్థ తెలిపింది. ఇక 'ఫౌజీ' విషయానికొస్తే.. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. విభిన్నమైన కథ, భారీ బడ్జెట్‌తో సిద్ధమవుతోంది. ప్రభాస్‌కు జంటగా సోషల్‌మీడియా స్టార్ ఇమాన్వీ నటిస్తున్నారు. ఇందులో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నారు. 1940వ దశకంలో జరిగే కథగా.. మాతృభూమి ప్రజలకు న్యాయాన్ని అందించడానికి ఓ యోధుడు చేసే పోరాటంగా మూవీ రానుంది. వాస్తవ సంఘటనలకు కొంత ఫిక్షన్ జోడించి హను రాఘవపూడి ఈ కథను సిద్ధం చేశారు.



# రౌడీ జనార్దన్ ప్లాన్ ఏంటి..?

విజయ్ దేవరకొండ కింగ్ మీద చాలా హోప్స్ పెట్టుకున్నాడు. జెర్సీ తర్వాత గౌతం తిన్ననూరి నుంచి వస్తున్న సినిమా కాబట్టి ఈ మూవీపై భారీ హైప్ ఉంది. ఐతే ఈ సినిమా విషయంలో ఆడియన్స్ అంచనాలు తారుమారయ్యాయి. విజయ్ వరకు ఓకే కానీ సినిమాను గౌతం ఫుల్ సాటిస్ఫైడ్ గా తీయడంలో విఫలమయ్యాడు. ఐతే కింగ్ డమ్ తో కమర్షియల్ హిట్ కొట్టాలని చూసిన విజయ్ కి నిరాశ తప్పలేదు. సినిమా విషయంలో ఎక్కడ తప్పు జరిగింది అన్న విశ్లేషణలు చేస్తున్నారు. కింగ్ డమ్ కి సీక్వెల్ కూడా ఉందని హింట్ ఇచ్చారు. మరి రిజల్ట్ చూశాక సీక్వెల్ ని తీస్తారా లేదా అన్నది చూడాలి.

ఇక ఇదిలాఉంటే విజయ్ దేవరకొండ నెక్స్ట్ రౌడీ జనార్ధన్ అనే సినిమా చేస్తున్నాడు. రవికిరణ్ కోలా డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో మహానటి కీర్తి సురేష్ హీరోయిన్ గా నటిస్తుందని తెలుస్తుంది. దిల్ రాజు నిర్మిస్తున్న రౌడీ జనార్ధన్ సినిమా ఇప్పటికే సెట్స్ మీద ఉంది. ఈ సినిమా రాయలసీమ బ్యాక్ డ్రాప్ లో లవ్ కం యాక్షన్ ఎంటర్టైనర్ గా వస్తుంది. విజయ్ దేవరకొండ కెరీర్ లో ఫస్ట్ టైం రాయలసీమ నేపథ్యంలో సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాలో చేస్తున్న కారణంగానే ఆమధ్య కింగ్ డం ఈవెంట్ తిరిపతిలో జరిగితే చితూరు యాసలో మాట్లాడాడు విజయ్.

ఐతే కింగ్ డ మొదటి షోతో పాజిటివ్ టాక్ తో మొదలైనా చిన్నగా యావరేజ్ టాక్ తెచ్చుకుని ఫైనల్ గా ఫెయిల్యూర్ అటెంప్ట్ అయ్యింది. ఈ సినిమా ఇంకా బ్రేక్ ఈవెన్ కాలేదని టాక్. ఐతే ఈ టైంలో రౌడీ జనార్ధన్ మీదే తన హోప్స్ పెట్టుకున్నాడు విజయ్ దేవరకొండ. ఆల్రెడీ వరుస ఫ్లాపులతో దిల్ రాజు కూడా విజయ్ సినిమా మీదే గురి పెట్టుకుని ఉన్నాడు.విజయ్ దేవరకొండ రౌడీ జనార్ధన్ ఇటు నిర్మాతకు, అటు హీరోకి ఒక మంచి హిట్ ఇవ్వాలి. ఐతే రౌడీ జనార్ధన్ అప్డేట్స్ విషయంలో మేకర్స్ ఆచి తూచి అడుగులేస్తున్నారు. సినిమా రిలీజ్ ఎప్పుడన్న క్లారిటీ లేదు. చెప్పడానికి అయితే 2026 సమ్మర్ కి తెచ్చే ప్లాన్ ఉందట. రౌడీ జనార్ధన్ విజయ్ కి పర్ఫెక్ట్ టైటిల్. విజయ్ ని మీడియాలో అంతా కూడా రౌడీ బోయ్ అనేస్తారు. అంతేకాదు విజయ్ దేవరకొండ కూడా తన ఫ్యాన్స్ ని రౌడీస్ అని పిలుస్తాడు. విజయ్ దేవరకొండ క్లాత్ బ్రాండ్ నేం కూడా రౌడీనే. సో ఇన్ని కలిసి వచ్చేలా టైటిల్ ఉంది కాబట్టి సినిమాకు ఇది కలిసి వచ్చే అంశమే అని చెప్పొచ్చు.విజయ్ దేవర కీర్తి సురేష్ చేసిన మహానటి సినిమాలో నటించాడు. కానీ కీర్తి సురేష్ తో సీన్స్ లేవు. ఐతే రౌడీ జనార్ధన్ లో ఈ ఇద్దరు కలిసి నటిస్తున్నారు. ఈ సినిమానే కాదు దిల్ రాజు బ్యానర్ లో వస్తున్న ఎల్లమ్మ సినిమాలో కూడా కీర్తి సురేష్ హీరోయిన్ గా నటిస్తుంది.